RNI No.68319/98

# మెట్రో ఈవినింగ్స్

Estd. 1998

VOICE OF WORDS (English Daily)

హైదరాబాద్,శుక్రవారం
జులై 10, 2026
పేజీలు : 8+4
సంపుటి: 29,సంచిక:27
వెల: రూ.6/-

Published from Hyderabad | ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్ | Metro Evenings Telugu Daily

## మనవడి కోసం రేవంత్ పూరీలు



హైదరాబాద్ (మెట్రో న్యూస్): నిత్యం పరిపాలనా పరమైన కార్యక్రమాలు, సభలు, సమీక్షలతో తీరిక లేకుండా గడిపే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా స్వహస్తాలతో మనవడికి పూరీలు చేసిపెట్టిన అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. తాత.. నువ్వు పూరీలు వేస్తేనే తింటా అని మనవడు అడిగితే తప్పుతుందా?.



## ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చేలా

# తెలంగాణను తీర్చిదిద్దుతాం

### స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (మెట్రో న్యూస్): రాబోయే రోజుల్లో ఒలింపిక్స్‌కు వేదికగా తెలంగాణను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పనిచేస్తున్నాం అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. 2036లో జరగబోయే ఒలింపిక్ క్రీడలకు భారత దేశం ఆతిథ్యమివ్వబోతుందని, తెలంగాణ కూడా అందులో భాగస్వామి కావాలన్నదే తన స్వప్నం అని తెలిపారు. జనాభా పరంగా ముందంజలో ఉన్న మన దేశం క్రీడల పరంగా చాలా వెనకబడి ఉన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. అడపాదడపా పీటీ ఉషా లాంటి ఆణిముత్యాలు మెరిశారని అన్నారు. పీటీ ఉషను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాలతో పాటు నగదు పారి తోషికం ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం అని చెప్పారు.

## మూసీ మొదటి దశకు సర్కార్

# గ్రీన్ సిగ్నల్

### రూ. 7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ. 7,345.12 కోట్ల మేరకు పరిపాలనా అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జోన్-1ఏ, జోన్-1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు ప్రారంభానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ., కలిపి మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ. 7,345.12 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏడీబీ నుంచి రూ. 4,500 కోట్ల రుణంతో ప్రాజెక్టును మొదలుపెట్టనున్నారు.



# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

### ఎల్‌నినోపై సర్కార్ అప్రమత్తం

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఎల్‌నీనో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రైతాంగం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, నీటి లభ్యతకు అనుగుణమైన ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. రైతులు భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న వర్షపాతం అంచనాలు, హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని సాగు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వదంతులను నమ్మకుండా అధికార యంత్రాంగం, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే మార్గదర్శకాలనే అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.

# స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించాలి

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగస్వాములు కావాలి పరిశ్రమలకు మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు విజ్ఞప్తి



హైదరాబాద్ (మెట్రో న్యూస్): గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్టీల్, సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి



# గ్రామాభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర

## మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు (మెట్రో న్యూస్):** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలని, ప్రణాళికాబద్ధమైన పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామాభివృద్ధిలో సర్పంచులే కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని, 16వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారమే వినియోగించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గ్రామ పంచాయతీలను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే లక్ష్యంతో గురువారం ములు గు లీలా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ సమగ్ర అభి వృద్ధి ప్రణాళిక, సర్పంచుల శిక్షణ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లా డుతూ, 16వ ఆర్థిక సంఘం నిధులు అమల్లోకి వస్తున్న తరుణం లో ప్రతి సర్పంచ్ నిధుల మార్గదర్శకాలు, వినియోగ విధానం, అనుమ తించబడిన పనులు, వ్యయ నియమాలను పూర్తిగా తెలుసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీల స్వంత ఆదాయాన్ని పెంపొందించేం దుకు పన్నులు, ఫీజుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి ఆర్థికంగా గ్రామ పంచాయతీలను బలోపేతం చేయాలని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే ప్రత్యేక నిధులకు ప్రత్యేక విధానాలు ఉంటాయని, వాటిని గ్రామ పంచాయతీ నిధులతో కలిపి వినియోగించరాదని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధిలో సర్పం చులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు ప్రజలకు చేరువవుతాయని, గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధి దిశగా తీర్చిదిద్దేందుకు ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

## అభివృద్ధి పనుల పై మంత్రి కొండా సురేఖతో పొన్నం భేటీ



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం మంత్రి కొండా సురేఖను నివాసంలో కలిసిన పొన్నం ప్రభాకర్ తన నియోజకవర్గం హుస్నాబాద్ పురోగతికి సంబంధించి దేవాదాయ, అటవీ శాఖలతో ముడిపడి వున్న పలు అంశాల పై చర్చించారు. అటవీ, దేవాదాయ శాఖలకు సంబంధించిన పలు పై అందించారు. ఈ సందర్భంగామంత్రికొండాసురేఖ హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తన శాఖల పరిధిలో పూర్తి సహకారం అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. దేవాదాయ, అటవీ శాఖలకు సంబంధించి వినతిపత్రంలో ప్రస్తావించిన అంశాలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## సీసీ రోడ్లు మంజూరు చేయండి: విజయేందర్ రెడ్డి



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** రామంతపూర్ భగాయత్ పరిధిలోని వెంకట సాయి నగర్ కాలనీ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు విజయేందర్ రెడ్డి మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ సీసీ రోడ్ల మంజూరు కోసం కమిషనర్‌కు అందించిన సిఫార్సు లేఖలను కూడా కమిషనర్‌కు అందజేశారు. కాలనీలో తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, ప్రస్తుతం సీసీ రోడ్ల నిర్మాణమే అత్యవసర అవసరంగా మారిందని వివరించారు. వర్షాకాలంలో బురద, దుమ్ము కారణంగా కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన పరిపాలనా చర్యలు చేపట్టి వెంకట సాయి నగర్ కాలనీ అంతటా సీసీ రోడ్ల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాధిక గుప్తా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు , వెంకట సాయి నగర్ కాలనీ కాలనీ కమిటీ సభ్యులు , కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మెడికల్ బోర్డు ఇవ్వకపోతే 20న దీక్ష చేస్తా

### - నిజాం ఇచ్చిన గనులన్నీ సింగరేణికి ఇవ్వాలన్న కవిత



**కొత్తగూడెం (మెట్రో న్యూస్):** నిజాం మనకు 17 గనులు ఇస్తే ఈ కేంద్రం వాటిని గుంజుకొని మనకు మళ్లీ ఒక్కటి ఇచ్చిందని, అయితే మిగతా 16 గనులు ఇచ్చే వరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెంటబడుతాం అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తేల్చి చెప్పారు. మెడికల్ బోర్డుపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఈ నెల 20న నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. ధర్మం మన వైపు ఉన్నప్పుడు ఎదురుగా ఉండేది ఎవరైనా భయపకుండా కొట్లాడాలని, తెలంగాణ రాకముందు, వచ్చిన తర్వాత కూడా సింగరేణి కార్మికుల కోసం నేను కొట్లాడుతున్నట్టు చెప్పారు. సింగరేణి కార్మికుల దయ, త్యాగాల ద్వారా తెలంగాణ వచ్చిందన్నారు. అప్పుడు నెలకు రెండు మెడికల్ బోర్డులు పెట్టి 20 వేల యువ రక్తం సింగరేణిలో చేరేందుకు తాను కష్టపడిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం కూడా నెలకు రెండు సార్లు మెడికల్ బోర్డు పెట్టాలి. డిపెండెంట్ ఉద్యోగాలు కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలు క్లియర్ అయ్యే వరకు నెలకు ఒకసారి మెడికల్ బోర్డు పెట్టాలన్నారు. ఈ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 30 నెలల్లో ఒక్కసారి మాత్రమే మెడికల్ బోర్డు పెట్టిందని విమర్శించారు. పాలకులకు మనసుంటే సింగరేణి ద్వారా లక్షల ఉద్యోగాలు ఇవ్వొచ్చు అన్నారు. కేంద్ర ప్రభుత్వం 25 లేబర్ చట్టాలను 4 కు కుదించి కార్మికుల హక్కులను కాలరాస్తోంది. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి ఈ చట్టాలను అమలు చేయమని అసెంబ్లీలో తీర్మానం చేయించాలి. అప్పుడు మాత్రమే మీరు కార్మికుల కోసం పనిచేస్తున్నట్లు నమ్ముతామన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని ఖతం

- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మాకు 78 సీట్లు వస్తాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని ఇక అయిపోయినట్లే అని, ఇదే అంశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించుకున్న సొంత సర్వేలోనూ తేలిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తన పరిపాలన పైన, తన నాయకత్వం పైన, సగం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఒక విస్తృత సర్వేను చేయించుకున్నారని, అందులోనూ ప్రజా వ్యతిరేకత చాలా స్పష్టంగా వ్యక్తమైందన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ సుమారు 78 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ సర్వేలో తేలిందన్నారు. రెండు మీడియా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ విభాగాలు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే అంశం వ్యక్తమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ నగర నేతలతో కేటీఆర్ గురువారం నాడు ప్రత్యక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తన సొంత సర్వేతో పాటు పలు సర్వేల్లో వ్యక్తమైన ప్రజా వ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే ముఖ్యమంత్రి గత వారం రోజులుగా అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. గ్యారంటీలు, డిక్లరేషన్లు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైనందువల్లనే తెలంగాణలోని సబ్బండ వర్గాలు కాంగ్రెస్ పార్టీ పరిపాలనపై నమ్మకం కోల్పోయారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ కార్యక్రమం అత్యంత మందకొడిగా సాగుతున్నదని, ముఖ్యంగా ప్రభుత్వం మరియు ఎలక్షన్ కమిషన్ నియమించిన బూత్ లెవెల్ ఆఫీసర్లకు సరైన శిక్షణ, తగిన ఏర్పాట్లు ఇవ్వకపోవడంతో మొత్తం ఈ కార్యక్రమం అత్యంత మందకొడిగా కొనసాగుతున్నదని, దీనివల్ల ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఫీడ్‌బ్యాక్ వస్తోందని ఆయన అన్నారు.

## పార్లమెంటరీ పార్టీ నేతగా వద్దిరాజు నియామకం



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర భారత రాష్ట్ర సమితి పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా నియమితులయ్యారు.ప్రస్తుతం పార్లమెంటరీ పార్టీ ఉప నేతగా వ్యవహరిస్తున్న రవిచంద్రను బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేతగా, పార్లమెంటరీ పార్టీ లీడర్ గా నియమించారు.బీసీలతో పాటు బహుజనులు,పార్టీకి రవిచంద్ర అందిస్తున్న సేవలను గుర్తించిన కేసీఆర్ ఆయన్ను రెండో సారి రాజ్యసభకు పంపడం జరిగింది.రాజ్యసభ సభ్యుడిగా ఉన్న డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ శాసనమండలికి వెళ్లడంతో,ఆ స్థానంలో రవిచంద్రను కేసీఆర్ ఎంపిక చేశారు.ఆ తర్వాత రెండో సారి రాజ్యసభకు కూడా ఎన్నిక య్యారు. బీఆర్ఎస్ నుంచి రాజ్యసభకు నలుగురు కే.ఆర్.సురేష్ రెడ్డి, దీవకొండ దామోదర్ రావు, డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి,వద్దిరాజు రవి చంద్ర ఎన్నికయ్యారు.పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న సురేష్ రెడ్డి ఇటీవల రిటైర్ కాగా,ఆ స్థానంలో రవిచంద్రను బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ నియమించారు.రవిచంద్ర పదవీ కాలం 2030 ఏప్రిల్ వరకు ఉంది. ఆయన పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం, బొగ్గు, గనుల శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులుగా కొనసా గుతున్న విషయం తెలిసిందే తనను పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎంపిక చేయడం పట్ల వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్, కార్య నిర్వహక అధ్యక్షులు కే.టీ.రామారావులకు హృదయపూ ర్వక కృతజ్ఞతలు తెలిపారు, బీసీ వర్గానికి చెందిన తనను రాజ్యసభకు రెండు పర్యాయాలు పంపడమే కాకుండా పార్లమెంటరీ పార్టీ నేతగా నియమించడం పట్ల రవిచంద్ర హర్షం వ్యక్తం చేస్తూ...తనపై ఉంచిన ఈ గురుతర బాధ్యతను స్వీకరించి,గౌరవిస్తూ తెలంగాణ ప్రజల గొంతును పార్లమెంటులో బలంగా వినిపిస్తానని, పార్టీని మరింత శక్తివంతం చేసేందుకు, కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు శక్తివంచన లేకుండా తన వంతు కృషి చేస్తాననిఎంపీవద్దిరాజు చెప్పారు.

## యూరియా లభ్యత మరింత సరళతరం

### - మీసేవ కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్ ప్రారంభం
### - వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** రాష్ట్రంలోని రైతులకు సబ్సిడీ యూరియా అందుబాటును మరింత సులభతరం చేయటం కోసం ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. పారదర్శకతను పెంపొందిస్తూ, సకాలంలో యూరియా పంపిణీ చేయటం కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ యూరియా బుకింగ్ సేవను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మీసేవ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది.ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోలేని రైతులు తమ సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించి, ఆపరేటర్ సహాయంతో యూరియా బుకింగ్ చేసుకోవచ్చు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల. శ్రీధర్ బాబు నేతృత్వంలో పనిచేస్తున్న మీసేవ, వ్యవసాయశాఖతో కలిసి ఈ కొత్త చొరవను ప్రారంభిస్తుంది.

**ఈసేవను పొందే విధానం:** రైతు తన పట్టాదారు పాస్‌బుక్ నంబర్తో సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సం దర్శించాలి. మీ సేవ ఆపరేటర్ రైతు వివరా లను సేకరించి, సాగు విస్తీర్ణం మరియు పంట వివరాలను నమోదు చేస్తారు.రైతు ఎంపిక చేసిన ఎరువుల డీలర్ వద్ద అవసరమైన యూ రియా పరిమాణాన్ని బుక్ చేస్తారు.రైతు నమోదిత మొబైల్ నంబర్‌కు పంపిన ఓటీపి ని ధృవీకరించిన తర్వాత వెంటనే బుకింగ్ ఐడి బుకింగ్ ఐడి జారీ చేయబడుతుంది.

**ముఖ్యమైన సూచనలు:** మీ సేవ ద్వారా పొందిన బుకింగ్ ఐడి బుకింగ్ చేసిన తేదీని మినహాయించి 48 గంటలపాటు మాత్రమే చెల్లుబాటు అవుతుంది.బుకింగ్ గడువు ముగిసేలోపు రైతులు ఎంపిక చేసిన ఎరువుల డీలర్‌ను సంప్రదించి యూరియాను కొనుగోలు చేయాలి. సబ్సిడీ యూరియా బుకింగ్‌ను అధికారిక ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లేదా మీ సేవ కేంద్రాల ద్వారానే చేయాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది.ఓటీపీ అందుకోవడానికి రైతులు తమ పట్టాదారు పాస్ బుక్ తో అనుసంధానమైన మొబైల్ నంబర్ యాక్టివ్‌లో ఉండేలా చూసుకోవాలి. కేవలం పదిరూపాయల నామమాత్రపు సేవా రుసుముతో మీసేవ ద్వారా రైతులు అందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.ఏవైనా సందేహాలు లేదా సహాయం కోసం సమీప వ్యవసాయ విస్తరణ అధికారి మండల వ్యవసాయ అధికారి లేదా సమీప మీసేవ కేంద్రాన్ని సంప్రదించవచ్చు. ఈ సౌకర్యాన్ని రాష్ట్రంలోని రైతులందరూ వినియోగించుకొని, సబ్సిడీ యూరియాను అధికారిక బుకింగ్ విధానం ద్వారా పొందాలని వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్ సూచించారు.

## బస్తీ దవాఖానాల తనిఖీలకు ప్రత్యేక అధికారుల నియామకం

### - హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** హైదరాబాద్ జిల్లా పరిధిలోని 169 బస్తీ దవాఖానల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను ఈనెల 10 వ తేదీన క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.ఈ తనిఖీలను సమన్వయం చేస్తూ తనతో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా రాబోయే రెండు మూడు రోజుల పాటు ఎంపిక చేసిన ముఖ్యమైన బస్తీ దవాఖానలను స్వయంగా తనిఖీలు చేస్తామని వెల్లడించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు బస్తీ దవాఖానలను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడమే ఈ ప్రత్యేక పర్యవేక్షణ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు.బస్తీ దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అలాగే మందుల నిల్వలు, ప్రయోగశాల సేవలు, పరిశుభ్రత, అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను వెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, బస్తీ దవాఖానలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు నిరంతరం కొనసాగిస్తుందని హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన భారత ఒలంపిక్ సంఘం అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష.

## వైద్యుడి అనుమతులు లేకుండా మత్తు మందుల విక్రయాలు

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** ముషిరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో డాక్టర్ ఇచ్చె మందుల చీటి లేకుండా మత్తు మందు బిల్లలను అమ్మకాలు జరుపుతున్న ముమ్మడి నవీన్ అనే వ్యక్తిని ఎస్టీఎఫ్ సీ టీమ్ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బంది కలిసి దాడి చేసి పట్టుకున్నారు.రూ. 50 మందు గోళీలను రూ. 500 అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నాడని సీఐ తెలిపారు. ఎన్‌డీపీఎస్ కింద ఉన్న ఈ మందుల డాక్టర్ ఇచ్చె మందుల చీటి లేకుండా అమ్మకాలు జరుపువద్దనే నిబంధన ఉన్న కూడ ఇంట్లో పెట్టుకొని ఎలాంటి మందుల చీటి లేకుండా అమ్మకాలు జరుపుతున్న నవీన్‌ను అరెస్ట్ చేశారు.నిందితుడి వద్ద నుంచి మూడు రకాల మత్తు మందులనుఎ 825 టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని, టాబ్లెట్లను ముషిరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

## మరో 7 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పర్సన్-ఇన్-చార్జ కమిటీల నియామకం

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** రాష్ట్రంలోని 27 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రత్యామ్నాయ నాన్-అఫీషి యల్ పర్సన్-ఇన్-చార్జ్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్త ర్వులు జారిచేసింది. తెలంగాణ సహకార సంఘాల చట్టం ప్రకా రం ఈ కమిటీ ఆరు నెలలపాటు లేదా ఆయా సంఘాలకు ఎన్ని కలు నిర్వహించే వరకు లేదా ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు, ఏది ముందైతే అది వర్తించే విధంగా నియమించడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు.యాదాద్రి జిల్లాలోని యాదగిరిగుట్ట, ఆత్మకూరు, రేణికుంట, ఆలేరు, బొమ్మలరామారం, తుర్కపల్లి, గుండాల పిఏసీఎస్‌లకు ప్రత్యా మ్నాయ నాన్-అఫీషియల్ పర్సన్-ఇన్-చార్జ్ కమిటీలను నియ మిస్తూ, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలు వెంటనే బాధ్యతలు స్వీకరించి ఆయా సహకార సం ఘాల నిర్వహణను పర్యవేక్షించనున్నాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఉత్తర్వుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని సహకార సంఘాల ప్రత్యేక కమిషనర్, రిజిస్ట్రార్‌ను మంత్రి ఆదేశించారు.

## ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు

### - రాష్ట్రవ్యాప్తంగా పోటెత్తిన అభిమానుల సందడి



**ములుగు (మెట్రో న్యూస్):** పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు డా. ధనసరి అనసూయ సీతక్క జన్మదిన వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ములుగులోని ఆదివాసీ గూడాల నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వరకు సీతక్కపై ప్రజల్లో ఉన్న అపారమైన ప్రేమ, ఆదరణ మరోసారి స్పష్టంగా కనిపించింది. మంత్రి సీతక్క జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ గీత రచయిత పాలకుర్తి రాజేందర్ రచించిన, ప్రముఖ గాయకుడు నల్గొండ గద్దర్ ఆలపించిన అడవి తల్లి బిడ్డ సీతక్క గీతాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వారికి స్వీట్లు పంచిపెట్టారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, పిల్లల చిరునవ్వులే తనకు నిజమైన జన్మదిన కానుక అని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి చిన్నారి సురక్షితంగా, ఆనందంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. ములుగు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా అభిమానులు, ప్రజలు తరలివచ్చిమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ గ్రామాలనుంచివచ్చిన మహిళలు, యువత, రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కార్యకర్తలుసంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరిస్తూ తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, పండ్ల పంపిణీ, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

మెట్రో ఈవినింగ్స్
3
హైదరాబాద్,
శుక్రవారం,
జులై 10, 2026

# మంత్రి సీతక్కకు హ్యాపీ బర్త్డే చెప్పిన సీఎంలు రేవంత్, చంద్రబాబు



హైదరాబాద్ (మెట్రో న్యూస్): పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా - శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా మంత్రి సీతక్కకు బర్త్డే విషెస్ చెప్పారు.

# ఆగస్టు 15లోగా ఫీజు బకాయిలు: ప్రభుత్వం

హైదరాబాద్ (మెట్రోన్యూస్): విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ఆగస్టు 15లోగా చెల్లిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. రీయింబర్స్మెంట్ బకాయిలపై కోర్టు ఇవాళ విచారణ జరిపింది. 'ఈ ఏడాది కొత్త అడ్మిషన్లకూ ఫీజులు చెల్లిస్తాం. 2,3,4 సంవత్సరాల విద్యార్థుల ఫీజులూ విడుదల చేస్తాం. ఫీజు రీయింబర్స్మెంట్ కింద మొత్తం రూ.1000 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది అని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు నివేదించారు.

# ఆంధ్ర కాంట్రాక్టర్ల ద్వారా బీఆర్ఎస్‌కు రూ.1400కోట్లు: కవిత

హైదరాబాద్ (మెట్రోన్యూస్):బీఆర్ఎస్ పార్టీ అకౌంట్లో రూ.1400కోట్లు ఉన్నాయని, అవి ఏపీ కాంట్రాక్టర్ల ద్వారా క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. ఆ అవినీతి సొమ్మును అమరవీరుల కుటుంబాలకు 7కోటి చొప్పున పంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై తాను ఒత్తిడి చేస్తుంటే బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైరయ్యారు. కేటీఆర్ అబద్ధాలు చెప్పుకోవడానికి రూ.188కోట్లు పెట్టి ఇంగ్లిష్ పేపర్ పయనీర్‌ను కొన్నారని ప్రెస్‌మీట్‌లో వ్యాఖ్యానించారు.

# ప్రపంచంలోనే ఉత్తమ నగరంగా హైదరాబాద్



- మహానగరాన్ని కాలుష్య కోరల నుంచి కాపాడుతాం
- ప్రీమియర్ ఎనర్జీస్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి
- 2028లోగా బుద్వేల్-కొడంగల్ మధ్య 100 ఫీట్ల రోడ్డు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): హైదరాబాద్ ప్రపంచంలోనే ఉత్తమ నగరం అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డుకు అవతలకు తరలిస్తున్నామని తెలిపారు. గురువారం నాడు రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపురంలో 'ప్రీమియర్ ఎనర్జీస్' కు సంబంధించిన సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభించిన సందర్భంలో సీఎం మాట్లాడుతూ, హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా చేయడానికి ప్రభుత్వానికి పరిశ్రమలు సహకరించాలన్నారు. ఈ విషయంలో ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థను ముఖ్యమంత్రి ప్రశంసించారు. మూసీ నది పూర్తిగా కాలుష్య కోరల్లో చిక్కుకుందని, దానిని పునరుజ్జీవం చేయడానికి తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రకృతిని విధ్వంసం చేస్తున్నారని, చెట్లను నరికేయడం వల్ల... హైదరాబాద్ కాలుష్యం బారిన పడుతోందన్నారు. పరిశ్రమలు రావాలి, పెట్టుబడులు పెట్టాలంటే, మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. సీతారామపురం ప్రజలు పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి తమ భూములను ఇవ్వడానికి ముందుకు రావడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.



# శంషాబాద్‌లో బొలేరో వాహనం బీభత్సం..

## ఇద్దరు మహిళలు మృతి

హైదరాబాద్ (మెట్రోన్యూస్): శంషాబాద్‌లో బొలేరో వాహనం బీభత్సం సృష్టించింది. బస్సు కోసం వేచి ఉన్న ఇద్దరు మహిళలపై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతులు సువర్ణ, సుమగా గుర్తించారు.




# వరదల్లో కొట్టుకుపోయిన 3,000 ఎల్పీజీ సిలిండర్లు

ఇంటర్నెట్ డెస్క్: మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వరదల కారణంగా పన్వేల్ తాలూకాలోని 'హెచ్‌పీసీఎల్ పాతాళగంగా ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్' నీటమునిగింది. దీంతో నింపినవి, ఖాళీవి కలిపి సుమారు 3,000 సిలిండర్లు వరద ప్రవాహంలో కొట్టుకుపోయి పాతాళగంగా నదిలోకి చేరాయి.
ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ కిషన్ జవాలే ప్రజలను అప్రమత్తం చేశారు. నదిలో లేదా ఒడ్డున కొట్టుకొచ్చిన సిలిండర్లు కనిపించినా వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకొద్దని సూచించారు. ఇంటికి తీసుకెళ్లొద్దని హెచ్చరించారు. వాటిలో గ్యాస్ ఉందో లేదో, అవి సురక్షిత స్థితిలో ఉన్నాయో లేదో తెలియదని వెల్లడించారు. వాటిని తెరవడం లేదా వినియోగించడం ప్రమాదకరమని పేర్కొన్నారు.వరదల్లో కొట్టుకుపోయిన సిలిండర్లను గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

# దద్దరిల్లుతున్న పశ్చిమాసియా

## గల్ఫ్ దేశాల్లో హై అలర్ట్



ఇంటర్నెట్ డెస్క్:అమెరికా, ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియా మరోసారి ఉద్రిక్తంగా మారింది. హెర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా బుధవారం తెల్లవారుజామున ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు జరిపింది. ఇందుకు ప్రతిగా బహ్రెయిన్, కువైట్‌పై ఇరాన్ దాడులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాలు అప్రమత్తమయ్యాయి. తాజాగా బహ్రెయిన్, కువైట్ దేశాలు క్షిపణి, డ్రోన్ హెచ్చరికలు జారీ చేశాయి. సైరన్‌లను మోగించి, సమీపంలోని సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, పౌరులను ఇళ్లలోనే ఉండాలని ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించాలని ఆయా దేశాల్లోని ప్రజలకు ప్రభుత్వాలు సూచించాయి. అలాగే యూఏఈ, ఖతార్, సౌదీ అరేబియా, ఒమన్ దేశాలు కూడా తమ భద్రతను మరింత కట్టదిట్టం చేశాయి.మరోవైపు ఇరాన్ అమెరికాకు దీటుగా బదులిచ్చింది.

# భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం



ఇంటర్నెట్ డెస్క్: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఇంధన భద్రతకు సంబంధించి కీలక ఒప్పందం కుదిరింది. దీంతో ఆస్ట్రేలియా నుంచి శాంతియుత అవసరాల కోసం భారత్‌కు యురేనియం ఎగుమతులకు మార్గం సుగమమైంది. ఇంధన రంగంలో రెండు దేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అడుగుగా దీనిని భావిస్తున్నారు. ఆస్ట్రేలియాలో జరిగిన వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ సంయుక్తంగా ఈ విషయాన్ని ప్రకటించారు. అణుశక్తి రంగంలో కీలక ఒప్పందం కుదిరిందని, దీనివల్ల ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరాకు మార్గం ఏర్పడుతుందని మోదీ తెలిపారు.

# ఢిల్లీలో కుండపోత వర్షం..

## ఆరెంజ్ అలర్ట్ జారీ



ఢిల్లీ (మెట్రోన్యూస్): ఉత్తర భారతదేశంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.భారీ వర్షాలతో జనజీవనం స్తంభించి పోతున్నది. గురువారం తెల్లవారుజామున ఢిల్లీలోనికొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షాలకు రోడ్లు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ్య మ్యాయి. ఢిల్లీలోని పలు ప్రాంతాలకు ఇప్పటికే ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చ రించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా న్యూఢిల్లీ రైల్వే స్టేషన్, మునీర్కా, ఇతర ప్రాంతాలతో సహా నగరంలోని కొన్ని ప్రాంతాలలో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశంలో కురుస్తున్న వర్షాలపై సమీక్షించారు. మంగళవారం కేరళలోని వయనాడ్‌లో శిథిలాలు కూలిపోయి పలువురు చనిపోవడం, జమ్మూలోని దోడాలో ఆకస్మిక వరదలు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగిన నేపథ్యంలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి భారీ వర్షాల వల్ల తలెత్తిన పరిస్థితులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# పార్టీ పేరు ముఖ్యం కాదు..!

## ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే కవిత ఎజెండా
## బీఆర్ఎస్ కుట్రలను అధిగమిస్తామని ధీమా



హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదగడమే లక్ష్యంగా కల్వకుంట్ల కవిత భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించారు. బయటకు పంపించడం దగ్గర్నుంచి... ఇప్పటివరకు బీఆర్ఎస్ పార్టీలో కొందరు బడా నాయకులు అడుగడుగునా అవరోధాలు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నా... బెదరకుండా ముందుకే సాగాలని ఆమె దృఢ నిశ్చయంతో ఉన్నారు. తనతో ఉన్న కార్యకర్తలను, నాయకులను జాగృతం చేస్తున్నారు. తాజాగా పార్టీ పేరుపై అభ్యంతరాల వెనకా బీఆర్ఎస్ నాయకులే ఉన్నారని తెలుస్తున్నా... ఆమె ఎక్కడా తడబాటుకు లోనుకాలేదు. జాతీయ ఎన్నికల సంఘం నోటీసులను గౌరవిస్తూనే... మరోవైపు ఢిల్లీ హైకోర్టులోనూ న్యాయం కోసం పోరాటానికి సిద్ధమయ్యారు.కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేసిన కేసీఆర్ తనయ... తండ్రి కన్నా మొండి మనిషి. మాజీ ముఖ్యమంత్రి చుట్టూ ఉన్న కొందరు అగ్రనాయకులు చేస్తున్న కుట్రలను బయటపెట్టినందుకే తనను పార్టీ నుంచి బయటకు పంపించారని కవిత ఇప్పటికీ భావిస్తున్నారు. దెయ్యాలు, గుంటనక్కలు, తోడేళ్లు కేసీఆర్‌ను కమ్మేస్తున్నాయని... కేసీఆర్ అధికారం చేపట్టాక పూర్తిగా వాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోయారని, మర మనిషిగా మారిపోయారని ఆమె సంచలన వ్యాఖ్యలు చేయడం తెల్సిందే.

కొత్త రాజకీయ పార్టీని స్థాపించిన కవిత... జనంబాట, బాయిబాట, ఉద్యమకారుల భూపోరాటాలు, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలతో జనంతో మమేకమై... పార్టీ విస్తరణపై కసరత్తు చేస్తున్నారు. అంశాల వారీగా ఉమ్మడి జిల్లాలలో పర్యటిస్తూ.. ప్రజల నాడిని తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు.నిసిసరిగ్గా ఈ సమయంలోనే టీఆర్ఎస్ పేరుపై ఈసీ నోటీసులు జారీ చేయడం కలకలం సృష్టించింది. నిజానికి పార్టీ పేరును కేటాయించేముందు ఎన్నికల కమిషన్ తనవంతుగా అన్ని విచారణలు చేపడుతుంది. ఇక్కడా... కవిత టీఆర్ఎస్ విషయంలోనూ అదే జరిగింది. ఆ తర్వాతే టీఆర్ఎస్ పేరును ఆవిర్భావ దినోత్సవం వేదికపై కవిత అధికారికంగా ప్రకటించారు. ఆ పేరుమీదే పార్టీ కార్యక్రమాలు మొదలుపెట్టారు. ప్రజాసమస్యలపై పోరాటం జోరు పెంచుతున్న తరుణంలో ఈసీ నోటీసులు కొత్త సమస్యలు తెచ్చిపెట్టాయి.



# కడియం శ్రీహరిపై చర్య తీసుకోండి

## పీసీసీ అధ్యక్షుడికి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ గురువారం నాడు టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్‌ను నార్సింగిలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నుంచి తనకు ఎదురవుతున్న ఇబ్బందులు, దేవాదాయ శాఖ మంత్రిగా తన అధికార పరిధిని ప్రశ్నించేలా ఇటీవల ఆయన వ్యవహరించిన తీరుపై పీసీసీ చీఫ్‌కు వివరించి, ఫిర్యాదు చేశారు. మహిళా మంత్రిని టార్గెట్ చేస్తున్న కడియంపై పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. మంత్రి వివరణను సానుకూలంగా విన్న మహేశ్ కుమార్ గౌడ్... సమస్యను సమగ్రంగా పరిశీలిస్తామని, సంబంధిత అంశాలపై తగిన స్థాయిలో చర్చించి న్యాయమైన పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కృషితోనాస్తి దుర్భిక్షం

మెట్రో ఈవినింగ్స్

4, హైదరాబాద్ శుక్రవారం జులై 10, 2026

# మళ్లీ అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు

మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య తలెత్తిన తాజా ఉద్రిక్తతలు అంతర్జాతీయ మార్కెట్లను ఒక్కసారిగా కుదిపేశాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ ప్రసక్తే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేయడంతో గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా రెక్కలు తొడిగాయి. ఈ పరిణామం ఇంధన అవసరాల కోసం దిగుమతులపైనే పూర్తిగా ఆధారపడే భారత్ లాంటి దేశాలకు కొత్త తలనొప్పులను తెచ్చిపెడుతోంది. భగ్గుమంటున్న చమురు ధరలు.. పతనమైన రూపాయి అంతర్జాతీయ మార్కెట్‌లో తాజా ట్రేడింగ్‌లో క్రూడాయిల్ ధరలు ఏకంగా 5 శాతానికి పైగా ఎగబాకాయి. ప్రస్తుతం వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ బ్యారెల్ ధర సుమారు 74 డాలర్లకు చేరగా, బ్రెంట్ క్రూడ్ ధర 78.57 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఈ చమురు సంక్షోభం భారత కరెన్సీపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ సుమారు 0.40 శాతం నష్టపోయి, సరికొత్త జీవితకాల కనిష్ట స్థాయి 95.67 వద్దకు పడిపోవడం దేశీయ మార్కెట్లను కలవరపెడుతోంది. అమెరికా మెరుపు దాడులు.. హొర్ముజ్ జలసంధిలో హై అలర్ట్ అమెరికా వర్గాల సమాచారం ప్రకారం.. జూలై 7న అమెరికా సెంట్రల్ కమాండ్ ఇరాన్‌లోని పలు వ్యూహాత్మక లక్ష్యాలపై భారీ ఎత్తున దాడులు నిర్వహించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హొర్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ జరిపిన దాడులకు ప్రతిస్పందనగానే తాము ఈ చర్యలు చేపట్టినట్లు అమెరికా ప్రకటించింది. ఈ వైమానిక దాడుల్లో ఇరాన్‌కు చెందిన వైమానిక రక్షణ వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలు.. తీర ప్రాంత రాడార్ వ్యవస్థలు, యాంటీ-షిప్ క్షిపణి కేంద్రాలు.. ఇస్లామిక్ రివల్యూషనరీ

## //ఎడిటోరియల్//

గార్డ్ కార్ప్స్ కు చెందిన చిన్న తరహా పడవలను అమెరికా సైన్యం పూర్తిగా ధ్వంసం చేసింది. గత నెలలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కాస్త తగ్గినట్లు కనిపించినా తాజా దాడులతో ఆ శాంతి తాత్కాలికమేనని తేలిపోయింది. ప్రపంచ చమురు రవాణాలో సింహభాగం సాగే హొర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు మరింత ముదిరితే, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్‌కు పొంచి ఉన్న ముప్పులేమిటి? తన ముడి చమురు అవసరాల్లో దాదాపు 80-85 శాతం వరకు దిగుమతుల ద్వారానే భారత్ తీర్చుకుంటుంది. ఈ నేపథ్యంలో తాజా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థపై బహుముఖ ప్రభావం చూపే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి పెరుగుతుంది. ఇంధన ధరలు పెరిగితే రవాణా వ్యయం భారమై, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయి. ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ఒకవైపు చమురు ధరలు పెరగడం, మరోవైపు రూపాయి బలహీనపడటంతో విదేశాల నుంచి చేసుకునే దిగుమతులు భారత్‌కు అత్యంత ఖరీదైనవిగా మారనున్నాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఈ భౌగోళిక రాజకీయ పరిస్థితులు రానున్న రోజుల్లో ఏ మలుపు తిరుగుతాయోనని ప్రపంచ దేశాలు ఉత్కంఠగా గమనిస్తున్నాయి. అమెరికా-ఇరాన్ సంక్షోభం గనుక మరింత ముదిరితే అది భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక ప్రగతికి పెద్ద బ్రేక్ వేసే ప్రమాదం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## ఎందుకో భయం !

మెట్రో డైలీ

వర్షం అంటే ఇష్టపడతావు..
చిరుజల్లులకు గొడుగు పడతావు !
సూర్యుడంటే ఇష్టం అంటావు..
ఎండ రాగానే నీడ వెతుకుతావు !
గాలి వీచడం ఇష్టం అంటావు..
ఇంటి కిటికీలను మూసేస్తావు !
చలికాలం సరదా అంటావు..
స్వెట్టర్, రగ్గు నిండా కప్పేస్తావు !
మనిషంటే ఇష్టం అంటావు..
మానవత్వం మరిచి పోయావు !
నేను నిన్ను ప్రేమిస్తున్నా అంటావు..
ఎందుకో భయం వేస్తోంది నాకు !

-మధుపాళీ, 9949700037

# కొత్తపుంతలు తొక్కుతున్న ప్రపంచ ఫ్యాషన్ టెక్నాలజీ

## మెట్రో తెలంగాణ చావడి




ప్రతి ఒక్కరు తమ ఫ్యాషన్ భావాలను వ్యక్తీకరించడానికి ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకుంటారు. ఒక్కొక్కరి వస్త్రధారణ ఒక్కో విధంగా ఉంటుంది. కులాలు, మతాలు, జాతులు, దేశాలు, ప్రాంతాలను బట్టి ఫ్యాషన్స్ మారుతుంటాయి. ఒక్కో జాతికి ఒక రకమైన విలక్షణ వస్త్రధారణ పద్ధతులు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచం, పరిశ్రమ చాలా పెద్దది. ఫ్యాషన్ టెక్నాలజీ క్షణక్షణం మారుతోంది. తరాలు మారిన కొద్దీ ఫ్యాషన్లు కూడా మారుతున్నాయి, కొన్ని సందర్భాల్లో వెర్రి పోకడలు కూడా సంతరించుకుంటున్నాయి. ప్రపంచ మానవాళి దృష్టిని తమ ఫ్యాషన్ల వైపుకు మరల్చుడానికి, ప్రత్యేక సౌందర్య భావాలను వ్యక్తం చేయడానికి, వారి వారి విభిన్న దుస్తులు లేదా ఉపకరణాలను ప్రదర్శించడానికి ఒక వేదికగా ప్రతి ఏట 09 జూలై రోజున "అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డే)" పాటించుట 2016 నుంచి ఆనవాయితీగా మారింది. నిని ఫ్యాషన్ ప్రపంచం చాలా పెద్దది: ఫ్యాషన్ రంగం చాలా పెద్దది. నేడు ప్రపంచ ఫ్యాషన్ పరిశ్రమ/మార్కెట్ దాదాపు 1.84 ట్రిలియన్ డాలర్ల వ్యాపారంగా మారింది. ప్రపంచ మానవ జనాభా 8 బిలియన్లకు సాలీనా దాదాపు 100 బిలియన్ల వరకు దుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రతి ఒక్కరికి సగటున ఒక ఏడాదికి 12 - 14 దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. వస్త్ర ఉత్పత్తిలో అతి పెద్ద దేశంగా చైనా తొలి స్థానాన్ని ఆక్రమించింది. ఫ్యాషన్ పరిశ్రమ ద్వారా సృజన, ఆవిష్కరణ, సంస్కృతి, వేషధారణ, పలు రకాలు




దుస్తులు, కేశాలంకరణ, అలంకరణ, ఆభరణాలు లాంటి పలు అంశాలు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచంలో వ్యక్తులు, డిజైనర్లు, క్రియేటర్స్, మోడల్స్, స్టైలిస్ట్స్, ఇన్నోవేటర్స్, ట్రెండ్స్, ఇన్ఫ్లుయెన్సర్స్ ద్వారా పలు రకాల ఫ్యాషన్స్ పుట్టుకొస్తున్నాయి, మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. నిన్నటి ఫ్యాషన్ నేడు పాతబడిపోయి, నేటి ఫ్యాషన్స్ కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. ఫ్యాషన్ అంటే దుస్తులు మాత్రమే కాదని, ఇది ఒక హద్దులు లేని వింత ప్రపంచమని అర్థం అవుతున్నది. ఫ్యాషన్ రంగం అంటేనే సృజనశీలత, ఆవిష్కరణ, సంస్కృతికి వైవిధ్యం, ప్రత్యేక గుర్తింపు లాంటి అంశాలకు పుట్టిళ్లు. సామాజిక మార్పులు, కళలకు అపూర్వ వేదికగా అంతర్జాతీయ ఫ్యాషన్ దినం ఉపయోగపడుతున్నది. నిని ఫ్యాషన్ టెక్నాలజీ - ఫ్యాషన్ డిజైనర్స్: ఫ్యాషన్ డిజైన్ అంటే దుస్తులు, కొన్ని వస్తువులను అందంగా, వినూత్నంగా తీర్చి దిద్దే కళ అని తెలుసుకోవాలి. దీనిలో అవలంభించే పద్ధతుల సమాహారాన్ని ఫ్యాషన్ టెక్నాలజీ అని పిలుస్తాం. మానవ అభిరుచులను బట్టి దుస్తులు, అలంకార వస్తువులను తయారు చేసే నిపుణులను ఫ్యాషన్ డిజైనర్స్ అంటాం. దుస్తులు, ఉపకరణాల రూపకల్పన, ఉత్పత్తిలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడాన్ని ఫ్యాషన్ టెక్నాలజీగా పిలుస్తున్నాం. ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ డిజైన్స్, వస్త్ర సాంకేతికత, ఫ్యాషన్ ఉత్పత్తులు, ఫ్యాషన్ మార్కెట్, రిటైల్ లాంటి పలు రంగాలు ఉంటాయి. నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్-సహాయ ఉత్పత్తి/డిజైన్స్, 3డి ప్రింటింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి పరిజ్ఞానాలు వాడబడుతున్నాయి. ఇవి ఫ్యాషన్ ప్రపంచ పరిశ్రమను మరింత సమర్థవంతంగా, సుస్థిరంగా, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, ఆకర్షణీయంగా మార్చడంలో సహాయపడుతున్నది.

ఆచార్య : బుర్ర మధుసూధన్ రెడ్డి

## మెట్రో ఇలవేల్పు

# అలంగుడి ఆపత్సహాయేశ్వరర్ ఆలయ మహిమ

### గంగా జన్మస్థలం ఇదే- బద్రీనాథ్ యాత్రలో తప్పక దర్శించాల్సిన తొలి పవిత్ర ప్రయాగ!

చార్‌ధామ్ యాత్రలో భాగంగా బద్రీనాథ్ మార్గంలో దర్శనమిచ్చే పంచ ప్రయాగాలు- దేవ ప్రయాగకు అత్యంత విశిష్టమైన స్థానం- అలకనంద, భాగీరథి నదులు సంగమించి గంగా నదిగా మారే క్షేత్రం ధామ్ యాత్రలో ముఖ్యమైన యాత్ర బద్రీనాథ్ యాత్ర. ఈ ధామానికి చేరుకునే మార్గంలో పంచ ప్రయాగలు దర్శనమిస్తాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని తెహ్రీ గర్వాల్ జిల్లాలో హిమాలయ పర్వత సానువుల్లో అలకనంద నది, దాని ఉపనదులతో కలిసే ఐదు పవిత్రమైన నదీ సంగమ ప్రదేశాలనే పంచ ప్రయాగలుగా వ్యవహరిస్తారు. హిందూ పురాణాల ప్రకారం ఈ పంచ ప్రయాగాలు అత్యంత పవిత్రమైనవిగా భావిస్తారు. రిషికేశ్ నుంచి బద్రీనాథ్ వెళ్లే మార్గంలో ఈ పంచ ప్రయాగలు దర్శనమిస్తాయి.

పంచ ప్రయాగలు ఇవే:

విష్ణు ప్రయాగ, నంద ప్రయాగ, కర్ణ ప్రయాగ, రుద్ర ప్రయాగ, దేవ ప్రయాగ అనే ఈ ఐదింటిని కలిపి పంచ ప్రయాగలు అంటారు.

దేవ ప్రయాగ

దేవభూమిగా పేరొందిన ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని తెహ్రీ గర్వాల్ జిల్లాలో వెలసి ఉన్న దేవ ప్రయాగ అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రం. దేవ ప్రయాగ వద్ద అలకనంద నది, భాగీరథి నదులు సంగమిస్తాయి. అక్కడ ఈ రెండు నదులు కలిసిన తర్వాతే దీనిని ః:గంగా నదిః: అని పిలుస్తారు. సముద్ర మట్టానికి దాదాపు 830 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ప్రదేశంలోనే శ్రీరాముడు ఇక్కడ అశ్వమేధ యాగం చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి.

ఆధ్యాత్మిక ప్రాముఖ్యత - రఘునాథ్‌జీ ఆలయం

దేవ ప్రయాగ పుణ్య క్షేత్రంలో సుమారు 10,000 సంవత్సరాల పురాతనమైన ప్రముఖమైన cరఘునాథ్ జీc అంటే శ్రీరాముని ఆలయం ఉంది. భారతదేశంలోని 108 వైష్ణవ దివ్యక్షేత్రాలలో దేవ ప్రయాగ కూడా ఒకటి. రావణాసురుడిని వధించిన తర్వాత ఏర్పడిన బ్రహ్మహత్యా పాతకాన్ని పోగొట్టుకోవడానికి శ్రీరాముడు ఇక్కడే కఠినమైన తపస్సు చేశాడని పురాణాలు చెబుతున్నాయి.

దేవ ప్రయాగ పేరు ఇలా వచ్చింది

దేవశర్మ అనే మహర్షి ఇక్కడే తపస్సు చేయడం వల్ల ఈ ప్రాంతానికి cదేవప్రయాగc అనే పేరు వచ్చింది. ప్రశాంతమైన ప్రాంతం ధ్యానానికి ఎంతో అనువైనది. సాధారణంగా బద్రీనాథ్ యాత్ర చేసే వారు దేవ ప్రయాగలో ఒకరోజు బసచేసి ధ్యానం చేసుకుంటారు. ప్రశాంతమైన ఈ వాతావరణంలో ధ్యానం చేయడం వలన అనారోగ్యాలు తొలగి, మానసిక ప్రశాంతత కలుగుతుందని విశ్వాసం. దేవ ప్రయాగ పరిసరాల్లో మరి కొన్ని దర్శనీయ ప్రదేశాలు కూడా ఉన్నాయి.

దేవ ప్రయాగలో దర్శనీయ స్థలాలు

సంగమ ఘాట్

అలకనంద నది, భాగీరథి నదుల పవిత్ర సంగం ప్రదేశమే సంగమ ఘాట్! భక్తులు ఇక్కడ పవిత్ర స్నానాలు ఆచరిస్తారు.

బేతాళ శిల: సంగమ ఘాట్‌కు సమీపంలో ఉన్న శిల బేతాళ శిల. ఈ శిల వద్ద స్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయని నమ్ముతారు.





కుంభకోణం నవగ్రహ క్షేత్రాల్లో గురు గ్రహానికి అంకితమైన అలంగుడి ఆపత్సహాయేశ్వరర్ ఆలయం- అత్యంత మహిమాన్వితమైన శైవ క్షేత్రంగా ప్రసిద్ధి- హాలాహల విషాన్ని సేవించిన శివుడు గురు దక్షిణామూర్తిగా వెలసిన దేవాలయం : ఆలయాల రాష్ట్రంగా ప్రసిద్ధి చెందిన తమిళనాడు రాష్ట్రంలో అనేక ప్రాచీన ఆలయాలు ఉన్నాయి. ఒక్కో ఆలయం వెనుక ఒక్కో పురాతన చరిత్ర దాగిఉంది. విశేషించి ఒక్క కుంభకోణం జిల్లాలోనే 2000కు పైగా ఆలయాలు వెలసి ఉన్నాయి. ప్రతి ఆలయం ప్రత్యేకమైనదే! కుంభకోణం పరిక్రమ మార్గంలో నవగ్రహాలకు చెందిన ఆలయాలు దర్శనమిస్తాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్కో నవగ్రహానికి ఒక్కో ప్రత్యేక ఆలయం ఉండడం విశేషం.

అలంగుడి - కుంభకోణం

కుంభకోణానికి సమీపంలో ఉన్న ప్రసిద్ధ దేవ గురు బృహస్పతి దేవాలయాన్ని గురుస్థానం అని పిలుస్తారు. ఇది తమిళనాడులోని తిరువారూర్ జిల్లాలో అలంగుడి అనే గ్రామంలో ఉంది. ఈ క్షేత్రం కుంభకోణంలో ఉన్న మొత్తం 9 నవగ్రహ క్షేత్రాలలో గురుస్థానంగా భాసిల్లుతోంది. ఇక్కడ పరమేశ్వరుడు దేవగురువు బృహస్పతి నామధేయంతో గరుదక్షిణామూర్తిగా పూజలందుకుంటున్నాడు. ఈ స్వామికి cఆపత్సహాయేశ్వరర్c అనే మరో పేరు కూడా ఉందని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

స్థల పురాణం

దేవ దానవులు అమృతం కోసం చేసిన క్షీరసాగర మథనంలో ముల్లోకాలనూ దహించి వేసేంత వేడితో హాలాహలం ఉద్భవించింది. దాని ధాటికి తట్టుకోలేక దేవతలంతా హాహాకారాలు చేస్తుంటే భోళాశంకరుడు ఆ గరళాన్ని సేవించి గొంతులో నిలుపుకొన్న చోటు ఇదేనని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఈ విధంగా తన భక్తులను ఆపద నుంచి గట్టెక్కించిన శివుణ్ని ఆపత్సహాయేశ్వరర్ అంటే ఆపద్బాంధవుడుగా దేవతలు కొలిచిన ప్రదేశం అయినందున ఇక్కడ శివునికి ఆపత్సహాయేశ్వరర్ అనే పేరు స్థిరపడింది. అంతేకాదు విషాన్ని మింగి గరళకంఠుడైన సదాశివుడు అక్కడే దేవదానవులకు జ్ఞానబోధ చేసి గురుదక్షిణామూర్తిగా వెలిశాడని పురాణాలు చెబుతున్నాయి.

అలంగుడి అపత్సయేశ్వర శివాలయం

అలంగుడి అనే పేరు ఆలం నుంచి ఉద్భవించింది. ఇది విశ్వాన్ని రక్షించడానికి శివుడు సేవించిన గరళానికి ప్రతీ! కుటుంబపరంగా, వృత్తి పరంగా, ఆరోగ్యపరంగా, ఆర్థికంగా అనేక విపత్తులను ఎదుర్కొంటున్న వారికి ఆశ్రయం కల్పించే ప్రదేశంగా ఈ ఆలయాన్ని పేర్కొంటారు. అంతేకాదు తనను ఆశ్రయించిన భక్తులను ఆపత్సహాయేశ్వరర్ సదా రక్షిస్తాడని పూనిక.

ఆలయ చరిత్ర

ఒకసారి తిరువారూర్‌ను పాలించిన చోళరాజు అలంగుడిలోని సుందరమూర్తి విగ్రహాన్ని చూసి ఆకర్షితుడై దానిని తిరువారూర్‌లో పూజ కోసం ప్రతిష్టించాలని కోరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అలంగుడి ఆలయ పూజారి భయాందోళనకు గురయ్యాడు. అతను ఆ విగ్రహాన్ని మశూచి సోకిన పిల్లవాడిలా మారువేషం వేసి, ఒక ఊయల లోపల దాచి, సురక్షితంగా అలంగుడికి తీసుకువచ్చాడు. అందుకే ఇక్కడ స్వామి విగ్రహంపై మశూచి జాడలు ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తాయి.

నవగ్రహ క్షేత్రాల విశిష్టత

హిందూ సంప్రదాయం ప్రకారం, నవగ్రహాలు ఏ వ్యక్తికైనా పూర్వజన్మ కర్మఫలాన్ని అనుసరించి సుఖదుఃఖాలు ప్రసాదిస్తాయి. నవగ్రహాలకు ప్రత్యేకించిన ఇలాంటి పుణ్య క్షేత్రాలను సందర్శించడం వల్ల గ్రహ దోషాలు తొలగుతాయని విశ్వాసం.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు: మున్సిపల్ చైర్మన్

### సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీలో పాల్గొన్న పుల్కం రాజు




మెట్రో న్యూస్ వేములవాడ పట్టణంలోని 15వ వార్డు బాలనగర్ ప్రాథమిక పాఠశాలలో సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా బలోపేతం చేస్తోందని అన్నారు. విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తోడుగా, సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ వంటి స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. గతంలోనూ ఈ ట్రస్ట్ ద్వారా అనేక వినూత్న సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యకు తమ వంతు చేయూతనిస్తే పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

అంతేకాకుండా ట్రస్ట్ వారు అందించిన వస్తువులను విద్యార్థులు సక్రమంగా ఉపయోగించుకుని ఉన్నత ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సహకారంతో మూడపల్లిలో రూ. 200 కోట్లతో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలును ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా దాదాపు రెండు వేల ఐదు వందల మందికి పైగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చైర్మన్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఇప్పపూల అజయ్, దూలం భూమేష్, కోయల్కారి మస్తాన్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతికతతో

# భూముల రీ సర్వే చేపట్టాలి

### రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్



మెట్రో న్యూస్ పెద్దపల్లి బ్యూరో. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూముల రీ సర్వేను డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.
మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టనున్నట్లు లోకేష్ కుమార్ తెలిపారు. ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. రీ సర్వే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అనంతరం గ్రామాల్లో రీ సర్వే పనులు ప్రారంభించాలని, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. భూ భారతి దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేసిన ఆయన, పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. హైకోర్టు వ్యక్తం చేసిన ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.
జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో రెండు కొత్త తహసీల్దార్ కార్యాలయ భవనాలకు పరిపాలనా అనుమతులు లభించాయని, వాటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో బి. ప్రకాష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి సోమేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులను ప్రోత్సహించాలి

### వ్యవసాయ అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలి

### జిల్లా కలెక్టర్



కరీంనగర్, మెట్రో న్యూస్ జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతున్నందున, ఎల్ నినో ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ అధికారులను ఆదేశించారు.ఎల్ నినో ప్రభావం, వానాకాలం సాగు, తదుపరి కార్యాచరణ అంశంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో మాట్లాడారు. కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు లోటు వర్షపాతం ఉందని, ఎల్ నినో ప్రభావం కూడా కనిపిస్తున్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు. రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు సమావేశాలు నిర్వహించి రైతులకు సూచనలు అందించాలన్నారు. ఆరుతడి పంటలు, పప్పు ధాన్యాలు, తృణ ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు వంటి పంటల సాగు ఆవశ్యకత తెలియజేయాలని ఆదేశించారు. దీనివల్ల ఎల్ నినో ప్రభావాన్ని కొంతమేర అధికమించవచ్చని, రైతులకు నష్టం జరగకుండా ఉంటుందని సూచించారు. జిల్లాలో బావులు, బోరుబావుల ద్వారా కూడా ఎక్కువ మొత్తంలో పంటలు సాగు అవుతున్నందున, ఆరుతడి పంటలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, తక్కువ నీటితో పంట చేతికి వస్తుందని అన్నారు. ఆన్లైన్ ద్వారా యూరియా అమ్మకాల ప్రక్రియ కొనసాగుతున్నందున జిల్లాలో ఎరువుల పంపిణీకి ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని అన్నారు. యూరియా అమ్మకాల ప్రక్రియను వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే సాగు చేయాలని, తద్వారా బోనస్ పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ రకాలను ప్రతి రైతుకు తెలియజేయాలని అన్నారు. ప్రతి రైతు వేదికను ఉపయోగించుకొని స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో రైతులకు వానాకాలం వ్యవసాయానికి సంబంధించిన ప్రతి సూచన తెలియజేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు నీటి లభ్యత, విడుదల తదితర అంశాలపై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో రైతు శ్రేయస్సు కోసం పనిచేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు, వాతావరణ సూచన, పంటల ఎంపికపై మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు మండలాల వారీగా సమీక్షిస్తానని తెలిపారు. అధికారుల సూచనలు రైతులు పాటించాలని, ఎలాంటి వదంతులను నమ్మవద్దని కోరారు. ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వీబిజిరామ్ జి పథకం అమలుకు సరైన ప్రణాళిక రూపొందించి కూలీలకు వీలైనన్ని ఎక్కువ పని దినాలు కల్పించాలని తెలిపారు.

# పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నివారణ

### మున్సిపల్ కమిషనర్ వీ.రాఘవేంద్ర





కోరుట్ల, జూలై 09 (మెట్రో న్యూస్) : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ వీ. రాఘవేంద్ర సూచించారు. గురువారం పట్టణంలోని 2వ వార్డులో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులు, డ్రై డే కార్యక్రమం, యాంటీ లార్వా చర్యలను ఆయన స్వయంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇళ్లలో పాత టైర్లు, ఎయిర్ కూలర్లు, కొబ్బరి చిప్పలు, ఇతర వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా మందులు పిచికారీ చేయడంతో పాటు ఆయిల్ బాల్స్ వేయాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఇంట్లో, ప్రతి కాలనీలో డ్రై డే నిర్వహించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ హుమెరా వాసీద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, అశోక్, జవాన్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల హక్కుల సాధనలో ఉపాధ్యాయ సంఘం ముందంజ

### -- ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి



రాయపర్తి, జూలై 9 (మెట్రో న్యూస్) ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు.రాయపర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ నివాస పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 55 ఏళ్ల చరిత్ర కలిగిన ఉపాధ్యాయ సంఘం ద్వారా ఉపాధ్యాయుల అనేక సమస్యలకు పరిష్కారం లభించిందని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో ఉమ్మడి పాఠ్య సమయ పట్టిక అమలు చేయించామని, గురుకుల సిబ్బందికి సున్నా--పది విధానం త్వరలో అమలులోకి తీసుకురావడంతో పాటు ఆరోగ్య గుర్తింపు కార్డులు అందించే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్, జిల్లా సహాయ అధ్యక్షుడు కటకం రఘు, మండల ప్రధాన కార్యదర్శి గాదె ప్రవీణ్ రెడ్డి, మండల సహాయ అధ్యక్షుడు ఎన్. స్వామి, సాంఘిక సంక్షేమ నివాస పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సృజన, రాష్ట్ర, జిల్లా, మండల సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డిని కలిసిన అమృతండా సర్పంచ్ బోడ వీర సింగ్.

వరంగల్ (జులై 9)మెట్రో ఈవినింగ్స్ వెంకటరెడ్డిని అమృతండా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బానోత్ వెంకన్న ఆధ్వర్యంలో తన నివాసంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులుతో కలిసి నూతనంగా ఎన్నికైన సొసైటీ చైర్మన్ .మొగిలి వెంకటరెడ్డి. కలిసి పుష్ప గుచ్ఛమ్ ఇచ్చి శాలువతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో. మాజీ సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు వర్కింగ్ ప్రెసిడెంట్ బోడాధన్ సింగ్ ఉపాధ్యక్షుడు నునావత్ నర్సు బోడ పంతులు వార్డ్ మెంబర్స్ బోడ సంతోష్ బోడ స్వరూపా ప్రవీణ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు బోడ కృష్ణ బోడ రవి భూక్య యాకూబ్ భూక్య బాలు, బోడరాజు భూక్య తారా సింగ్ నునావత్ రాజు బోడ శ్రీనివాస్ భానోత్ వీరా సింగ్ గోడ మీటియా బానోతు రెడ్డి భాను సంధ్య బోడా పంతులు లావుడియా బద్రు పంతులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## వాజేడు మండలంలో

# జోరుగా గుడుంబా విక్రయాలు..



సరిహద్దులు దాటి వస్తున్న వైనం..

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ!




వాజేడు, జులై 9 మెట్రో న్యూస్ :ములుగు జిల్లా వాజేడు మండలంలో గుడుంబా విక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నాయి. పక్క రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ నుండి రోజుకు వందల లీటర్ల గుడుంబాను యధేచ్ఛగా సరిహద్దులు దాటించి ఇక్కడికి తీసుకొచ్చి అమ్ముతున్నారు. ఎలాంటి భయం లేకుండా పట్టపగలే బహిరంగంగా ఈ విక్రయాలు జరుగుతుండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

**మెట్రో న్యూస్ కెమెరాకు చిక్కిన గుడుంబా దందా**

మండలంలో ఏ నిఘా లేకుండా సాగుతున్న ఈ అక్రమ వ్యాపారం గురువారం ఉదయం మెట్రో న్యూస్ రిపోర్టర్ కెమెరాకు చిక్కింది. ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుంచి గుడుంబాను తరలిస్తూ, ఇక్కడ యధేచ్ఛగా విక్రయిస్తున్న దృశ్యాలు సాక్ష్యాధారాలతో సహా రికార్డయ్యాయి. పట్టపగలే ఇంత బహిరంగంగా దందా సాగుతున్నా.. అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై స్థానిక ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్సైజ్ అధికారుల అండదండలు లేదా మామూళ్ల వల్లే ఈ అక్రమ వ్యాపారం నిరాటంకంగా సాగుతోందని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.విషపూరితమైన ఈ గుడుంబాను తాగి ఇప్పటికే మండలంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డా, ఇటు అధికారులు కానీ, అటు ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ ఈ గుడుంబా మహమ్మారి మరింత పెరిగిపోతుందే తప్ప తగ్గడం లేదు.మెట్రో న్యూస్ సాక్షిగా గుడుంబా విక్రయాలు బయటపడినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే ఊరుకునేది లేదని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వాజేడు మండలంలో ఛత్తీస్‌గఢ్ గుడుంబా రవాణాకు అడ్డుకట్ట వేయాలని, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక అధికారులపై విచారణ జరపాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# త్వరలో సిపిఎస్ రద్దు,2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు.

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ పింగిలి శ్రీపాల్ రెడ్డి.



వరంగల్ (జూలై 9)మెట్రో ఈవినింగ్స్ పాఠశాల సందర్శనలో భాగంగా ఈరోజు ఉమ్మడి వరంగల్ నల్గొండ ఖమ్మం టిఆర్టియుటిఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి చెన్నారావుపేట మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకులం దుగ్గొండిని ఆకస్మికంగా సందర్శించారు సందర్శనలో భాగంగా విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల అంకిత భావం, పనితనాన్ని కొనియాడారు. పాఠశాల బిల్డింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తానని, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేస్తానని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుకు , 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అనగా సిపిఎస్ రద్దు చేయించుటకు పలు దఫాలుగా ప్రభుత్వంతో చర్చించానని వాటిని రద్దు చేయించుటకు కట్టుబడి ఉన్నానని , పి ఆర్ సి ని త్వరలో ప్రకటించేలా కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో పర్యావరణ రక్షణకు మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్టియుటీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఈదునూరి రవీందర్ రెడ్డి , హనుమకొండ జిల్లా అధ్యక్షులు మండల తిరుపతిరెడ్డి , వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ నకిరెడ్డి మహేందర్ , చెన్నారావుపేట మండల అధ్యక్షులు శ్రీ పూజారి సురేందర్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీ పోలేపల్లి రవి కటకం రఘు,కర్ర యాకుబ్ రెడ్డి , చెన్నారావుపేట మండలం ప్రధాన కార్యదర్శి బానోతు వెంకన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీమతి గ్లోరీ రజినీ వెంకటరమణ రాధిక లావణ్య భాగ్య లక్ష్మి సరిత రజిత రాజమణి స్వప్న ఉమారాణి కవిత పూదోట అనిల్ , మర్రి రాజు, బొమ్మెర సతీష్, రత్న సింధు తదితరులు పాల్గొన్నారు .

## ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి న సర్పంచ్



చిట్యాల మెట్రో న్యూస్ (జులై 9)మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్వయంగా విద్యార్థుల తో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేసిన గ్రామ సర్పంచ్ శ్రీమతి శ్రీ సాగర్ల భాను శ్రీ భిక్షం ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల బలోపేతం కోసం విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం తో పాటు ఉదయం ఆల్పాహారశీ కూడా అందజేస్తుశీదని ఈ అవకాశాన్ని విద్యార్థుల సద్వినియోగం చేసుకోని మీ బంగారు భవిష్యత్తు కు బాటలు వేసుకోవాలన్నారు .

## ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం



చిట్యాల మెట్రో న్యూస్ (జులై 9) మండలంలోని వెలిమినేడు లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరియు ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్ర పటాలకు పాలాభిషేకం చేయడం జరిగింది. రైతులకు రైతు భరోసా ద్వారా ఎపిమిది ఎకరాలకు డబ్బులు వేసినశీదుకు సంతోషంగా నిర్వహించిన ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య, నర్రా మోహనరెడ్డి, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేష్, పిఎసిఎస్ చైర్మన్ రాఘుమారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు సత్తిరెడ్డి, బొంతల అంజిరెడ్డి, కొంపల్లి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ మల్లమ్మ, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

### గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకోవాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.గ్రామ పంచాయతీ--సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం, రవి మహల్ సూర్యాపేట జిల్లాకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

**గ్రామ వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలి**

ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత



అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత**

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రధాన సమస్యలను ప్రతి గ్రామ పంచాయతీ గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి గ్రామ పంచాయతీ రాబోయే మూడు సంవత్సరాల కాలానికి గ్రామ పంచాయతీ--సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ను రూపొందించుకోవాలని సూచించారు. ప్రణాళిక తయారీలో ప్రధానంగా ఏడు అంశాలపై వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించుకోవాలని తెలిపారు.

**ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. ఇంటి వద్దనే చెత్తను వేరు చేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త సేకరణ సమయంలో తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, తదితరాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో పారవేయాలని తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు.స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద మరుగువదొడ్ల , సామజిక ఇంకుడు గుంటలు , కమ్యూనిటీ సానిటరీ కంప్లీక్స్ మరియు ప్లాస్టిక్ వేస్ట్ మానేజ్మెంట్ యూనిట్స్ నిర్మించాలని సూచించారు.

**జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పన**

జీ రామ్ జీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల పని దినాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే గ్రామాల్లో మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీఓ భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ సన్యాసయ్య , డీపీఓ యాదగిరి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత అభివృద్ధికి కృషి చేస్తాం- చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు కొంగరి జంగయ్య

భూదాన్ పోచంపల్లి, జూలై 9 (మెట్రో న్యూస్):మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లి చేనేత కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై, గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. సంఘం అధ్యక్షుడిగా కొంగరి జంగయ్య, ఉపాధ్యక్షుడిగా మనం వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా కొంగరి వెంకటేష్, కోశాధికారిగా చెల్లిగారి గురుస్వామి ఎన్నికయ్యారు. సభ్యులుగా గుండు కృష్ణ, గంజి సుదర్శన్, రవ లక్ష్మణ్, సూరపల్లి లక్ష్మమ్మ, ఉద్యాన జయమ్మలను ఎన్నుకున్నారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మూడో వార్డు కౌన్సిలర్ రావుల జంగయ్య, కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్




అధ్యక్షుడు మర్రి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ గుండు మధు ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శు భాకాంక్షలు తెలిపారు. అధికారి మురళీ మనోహర్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ సందర్భంగా సంఘం బలోపేతంతో పాటు చేనేత కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కడవేరు ఎల్లప్ప, రుద్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పన కు కృషి

### మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

### రూ.3.5 కోట్లతో 60 అడుగుల రహదారి పనులకు శ్రీకారం



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన కు కృషి చేయనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సూర్యాపేట పట్టణ అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకం కింద నల్లచెరువు కట్టపై నిర్మించనున్న 60 అడుగుల వెడల్పు రహదారి పనులను గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని 8వ, 9వ వార్డులను అనుసంధానించే ఈ రహదారిని సుమారు అర కిలోమీటరు మేర రూ.3.5 కోట్ల అంచనా వ్యయంతో మూడు నెలల వ్యవధిలో పూర్తి చేయనున్నట్లు అధికారులు, గుత్తేదారులు తెలిపారు. పబ్లిక్ హెల్త్ శాఖ, మున్సిపాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బండారు మంగమ్మవెంకన్న, పోతురాజు హిందు శ్రీ అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ అమృత్ 2.0 పథకం ద్వారా పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. నల్లచెరువు పరిసర ప్రాంతంలో రహదారి నిర్మాణం పూర్తయితే 8వ, 9వ వార్డుల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, పరిసర ప్రాంతాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సృజన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గంగా లింగారెడ్డి, వెన్న చంద్రారెడ్డి, నాగేందర్ రెడ్డి, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వం కల్లుగీత వృత్తిదారులకు ఆర్థిక చేయూత కల్పించాలి.

మెట్రో న్యూస్ (జూలై 9) హుజూర్ నగర్:తెలంగాణ కల్లుగీత పనివాళ్ల సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయగలరు అని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల కూరి బాబు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా కల్లుగీత వృత్తిదారులకు 51 సంవత్సరం నిండిన అర్హులైన కల్లుగీత పనివారలకు పెన్షన్లు ఇవ్వాల్సి ఉండగా రెండున్నర సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ కల్పించట్లేదు అని గీత వృత్తి పెన్షన్లు పొందుతూ మరణించిన వారి భార్యలకు పెన్షన్లు మంజూరు చేయకుండా వారి కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల్లో పడవేశారు అని గీత వృత్తి చేస్తూ తాటి చెట్టు పై నుండి పడి మరణించిన వికలాంగులైన వారికి ఇవ్వాల్సిన ఎక్స్గ్రేషియో లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని వీటి కొరకై ది 10 జులై2026న ఉదయం 10 గంటలకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో పెన్షన్ కు అర్హులైన వారు వితంతువులు పెండింగ్ ఎక్స్గ్రేషియా బాధితులు పాల్గొని విజయవంతం చేయాలని కార్యవర్గ సభ్యులు పాలకూరి బాబు కోరారు.

## అవినీతి సొమ్మును అమరవీరుల కుటుంబాలకు పంచాలి

- సింగరేణిలో మెడికల్ బోర్డును నిర్వహించాలి
- కంపెనీ పరిరక్షణ కోసం ఉద్యమిస్తాం
- తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత



కొత్తగూడెం ఆర్ సి (మెట్రో న్యూస్):బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్ల అవినీతి సొమ్ము అమరవీరుల కుటుంబాలకు పంచాలని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను పార్టీ పెట్టిన తర్వాత బీఆర్ఎస్ పార్టీకి వణుకు పుడుతుందన్నారు. తమ పార్టీతో భయం లేదంటూనే ఈసీకి వెయ్యికి పైగా కంప్లైంట్స్ ఇవ్వడం జరిగిందన్నారు. టీఆర్ఎస్ అనే పేరు తనకు రాకుండా ఉండాలని కుట్రలు చేస్తున్నారని తెలిపారు.నా ప్రజా పోరాటాలను ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, బీజేపీలతో చేతులు కలుపుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి ఒక నీతి, నియమం అంటూ ఏమీ లేవా అంటూ ప్రశ్నించారు. తల్లి చెల్లె అనే సభ్యత మరిచి బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ఇష్టానుసారం కామెంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. సభ్యత మరిచి తిడితే ఊరుకునేందుకు ఇది ఆంధ్రా కాదని కాళ్లు విరగొట్టి చేతుల్లో పెడతాం చేతుల్లో అంటూ హెచ్చరించారు. కాళేశ్వరం అవినీతిలో అనకొండ అయిన హరీశ్ రావు నే బీఆర్ఎస్ ఇంకా ముందు పెడుతుందన్నారు.ఇక ఆ పార్టీ జీవితంలో బాగుపడని స్పష్టమైందన్నారు. సింగరేణి రక్షణ కోసం పోరాడుతా...సింగరేణి పరిరక్షణ కొరకు తాను శక్తి మేరకు పోరాడుతానని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఇవ్వాళ సింగరేణి ఇబ్బందుల్లో ఉండటానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్నారు. సంస్థకు ఇవ్వాల్సిన 54 వేల కోట్లు ఇవ్వకపోవటంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులు పనిముట్లు అడిగితే పైసలు లేవంటున్నారని ఇది మహా దారుణమన్నారు.

**కార్మికుల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారు..?**

సింగరేణి కార్మికుల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. సింగరేణిలో వన్ విజన్, వన్ ఫ్యామిలీ అంటారు కానీ ఆఫీసర్లకు ఒక రూల్, కార్మికులకు ఒక రూల్ నడుస్తుందన్నారు. కిషన్ రెడ్డి తెలంగాణ బిడ్డనే అయితే సింగరేణికి టెండర్లు లేకుండా గనులు ఇవ్వాలని తాను నిర్వహించిన మొదటి దఫా బాయి బాటలో డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఒక మైనింగ్ ఇచ్చి ఏదో గొప్పగా చెప్పుకుంటున్నారు కానీ మిగతా 16 గనులను కూడా సింగరేణికి ఇవ్వాలని కోరారు. బీజేపీ నిర్లక్ష్యం కారణంగా సింగరేణి కార్మికులకు చాలా అన్యాయం జరుగుతోందన్నారు. ఇప్పుడు కచ్చితంగా నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టి పెండింగ్ లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల కోసం ప్రాణాలకు తెగించి మేము పోరాటం చేసి చేసి చూపిస్తామని కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**
**తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు ఆశీర్వాద సభకు చింతకాని వేదిక**
**9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ**
**తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి పెట్టాలి**
**150 స్టాల్స్ ఏర్పాటు అంచనాలకు మించి 11 వేల మంది రైతుల హాజరు**
**మెగా రైతు మేళాలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



చింతకాని మెట్రో ఈవెనింగ్ జూలై-09:రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాకు రైతులు విశేషంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రివర్గం రైతుల అవసరాలు, వ్యవసాయ రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని, తమ ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వమని అన్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, కడెం వంటి సాగునీటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగిపోవడం ఆ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, అందుకే ఇక్కడ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు.ప్రభుత్వానికి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేశామని తెలిపారు. వ్యవసాయ ఆధునీకరణ కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తున్నామని తెలిపారు.రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్తలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి సహా తెలంగాణ మంత్రివర్గం మొత్తం హాజరవుతుందన అన్నారు.ప్రస్తుతం రైతులకు అందుతున్న ప్రతి నీటి చుక్క కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే వస్తోందని తెలిపారు.

రైతులను మాయమాటలతో మోసం చేసే పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వబోరని అన్నారు.రైతు సంక్షేమానికి పునాదులు వేసిన ప్రభుత్వాలను రైతులే కాపాడుకుంటారని, ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్న అబద్ధాలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. చింతకాని మండలంలో మూడు లక్షల మంది రైతులతో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులకు అందించాలనే లక్ష్యంతో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. రైతుల అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని, శాస్త్రవేత్తలు చెప్పే అంశాలను రైతులు శ్రద్ధగా విని గ్రామాలకు తీసుకెళ్లాలని కోరారు. ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఫిషరీస్, హార్టికల్చర్ తదితర అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూఖమ్మం జిల్లాలో జూన్ 30న నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభ వర్షాల కారణంగా జూలై 10వ తేదీకి వాయిదా పడిందన్నారు. తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడం లేదని, ఈ ఏడాది నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఎలా వ్యవసాయం చేయాలనే అంశాలపై వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనలు అందిస్తోందన్నారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలు అందించాలని చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వినియోగించుకుంటూ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలిస్తున్నామని, దీంతో వర్షాలతో సంబంధం లేకుండా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు.తక్కువ కాలంలో, తక్కువ నీటితో పండే పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేయలేదని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు డిప్యూటీ సీఎం రూ.5 వేల కోట్లు కేటాయించి మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేశారని తెలిపారు. మొక్కజొన్నతో పాటు జొన్న, సోయా తదితర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతుల ఖాతాల్లో మద్దతు ధర చెల్లింపులు రేపటిలోగా జమ చేస్తామని స్పష్టం చేశారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభ చారిత్రక ఘట్టమని, రైతులకు అవసరమైన ప్రతి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాది మంది రైతులు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఉద్యమాలు, పోరాటాలు, వ్యవసాయ రంగంలో ఖమ్మం జిల్లాకు ఘన చరిత్ర ఉందని, జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందన్నారు. సంప్రదాయ పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు.సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ద్వారా వచ్చే వేతనం కంటే ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం, ప్రకృతి సహకరించక పోయినా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమకూరుస్తున్నామని, యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా యాప్ వల్ల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పోయిందన్నారు.రైతులకు వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రపంచంలో ఉన్న అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెగా రైతు మేళా, రైతు ఆశీర్వాద సభ నిర్వహణకు అద్భుతమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించేందుకు ఈ మెగా రైతు మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదర్శ రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలను ఇతర రైతులకు పరిచయం చేయడం కూడా ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.పంట మార్పిడి విధానం అమలు చేయడం, ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు హార్టికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు... ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు అనువైన పంటల సాగు పై అవగాహన కల్పించాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



మెట్రో న్యూస్ వనపర్తి రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వల్ల ఇప్పటి వరకు జిల్లాల వారీగా కురిసిన వర్షాలు, రిజర్వాయర్ లో ఉన్న నీటి లభ్యత, రైతులకు ఇవ్వాల్సిన సూచనల పై రాష్ట్ర ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఇప్పటి వరకు లోటు వర్షపాతం నమోదు అయ్యాయని, రానున్న మూడు నెలలు సైతం ఆశించిన స్థాయిలో వర్షాలు పడే అవకాశం లేదని వాతావరణ శాఖ నివేదికలు ఇస్తున్న నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి రైతులకు పంట మార్పిడి పై తగిన సూచనలు, సలహాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్లను సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జూరాల, రామన్ పాడ్ రిజర్వాయర్ లో ఉన్న నీటి నిల్వలు, రిజర్వాయర్ లోకి వస్తున్న నీటి పై ఇరిగేషన్ అధికారులకు వివరాలు అడిగారు. ప్రస్తుతం జూరాలకు పై నుండి ఎలాంటి నీటి ప్రవాహం లేవని, మహారాష్ట్ర కర్ణాటకలో వర్షాలు బాగా పడితే ఆల్మట్టి నుండి నీరు వదిలితే కాస్త వచ్చే అవకాశం ఉందని అవి తాగు నీటికి సరిపోతుందని ఇరిగేషన్ సి. ఈ రహిమొద్దీన్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, ఇరిగేషన్ సీఈ రహీముద్దీన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, ఉద్యానవన శాఖ అధికారి విజయ భాస్కర్, ఇరిగేషన్ ఈ ఈ లు, డి. ఈ లు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోపణలు నిరూపించకపోతే పరువునష్టం దావా వేస్తా.

**బీఆర్ఎస్ కు మార్కెట్ చైర్మన్ రమణారావు సవాల్.**
**మొక్కజొన్న కొనుగోళ్లలో అవినీతి లేదని స్పష్టం.**
**కలెక్టర్, సహకార శాఖతో విచారణకు సిద్ధం.**
**గొరిట పీఏసీఎస్‌లో గత ప్రభుత్వ హయాంలో రూ.1.20 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపణ.**




నాగర్‌కర్నూల్ బ్యూరో:---(మెట్రో న్యూస్:జూలై 9)పెద్దముద్దునూరు గ్రామంలో మొక్కజొన్న కొనుగోళ్లలో తనపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అవినీతి ఆరోపణలు పూర్తిగా నిరాధారమని,వాటిని ఆధారాలతో నిరూపించలేకపోతే పరువునష్టం దావా వేస్తానని నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు హెచ్చరించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, సహకార శాఖ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. విచారణలో తాను అవినీతికి పాల్పడినట్లు తేలితే ఎలాంటి శిక్షనైనా స్వీకరించేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమణారావు మాట్లాడుతూ, రాజకీయ మైలేజ్ కోసం బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై బురదజల్లడం తప్ప బీఆర్ఎస్‌కు మరో పని లేదని అన్నారు. అభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పెద్దముద్దునూరు పీఏసీఎస్ ద్వారా 473 మంది రైతుల నుంచి 26,836 క్వింటాళ్ల మొక్కజొన్నను 52 వేల సంచుల్లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో 47 వేల సంచులను ఇప్పటికే తరలించామని, కొంత సరుకును లారీల ద్వారా, మిగిలినదాన్ని ట్రాక్టర్ల ద్వారా నాగనూలు కేంద్రానికి పంపించినట్లు వివరించారు. ఒక్కో సంచికి రూ.10 మాత్రమే రవాణా చెల్లింపులు జరిగాయని, రూ.30 నుంచి రూ.35 వరకు చెల్లించారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. మొత్తం సంచుల వ్యయం సుమారు రూ.4 లక్షలు మాత్రమే కాగా, రూ.44 లక్షల అవినీతి జరిగిందని చెప్పడం రాజకీయ దుష్ప్రచారమేనని విమర్శించారు. తాను సీఈఓలను ఫోన్‌లో బెదిరించానని లేదా రైతుల నుంచి డబ్బులు వసూలు చేశానని ఎవరైనా నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని రమణారావు సవాల్ విసిరారు. రైతుల నుంచి అక్రమంగా డబ్బులు తీసుకున్నట్లు తేలితే తన ఇంటిని ముట్టడించినా అభ్యంతరం లేదని, గ్రామానికి వచ్చి రైతులనే అడిగి నిజానిజాలు తెలుసుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.
మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి జనార్దన్‌రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికిన రమణారావు, తిమ్మాజీపేట మండలం గొరిట పీఏసీఎస్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1.20 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. అలాగే మాజీ జెడ్పీటీసీ శ్రీశైలం తనపై చేసిన ఆరోపణలను నిరూపించకపోతే ఆయనపై కూడా పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు బ్యాగులు, లారీల కొరత వంటి సమస్యలు తలెత్తకుండా డైరెక్టర్లతో కలిసి చర్యలు తీసుకున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కోటయ్య, గోపాల్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ హబీబ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధిపై పెద్దముద్దునూరు రైతుల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. గత ప్రభుత్వంలో ఇసుక దందా, రియల్ ఎస్టేట్ మాఫియా అవినీతి విస్తృతంగా జరిగాయని ఆరోపిస్తూ, మిషన్ పనుల్లో రూ.59 లక్షలు, పెద్దముద్దునూరులో రూ.9 లక్షల అవినీతి జరిగిందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో బిజినపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములు, వైస్ చైర్మన్ జంగయ్య, కొత్త శ్రీనివాసులు, బుచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, జక్కా రాజు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలనే లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ విమర్శలు చేస్తోంది.. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి.

**ఫ్యూచర్ సిటీ నుంచి రైతు సంక్షేమం వరకు ప్రతి అంశంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శ.**



మెట్రో న్యూస్ మహబూబ్నగర్ బ్యూరో జూలై 8: కాంగ్రెస్, ప్రభుత్వంచేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను బీఆర్ఎస్ పార్టీ ఉద్దేశపూర్వకంగా వ్యతిరేకిస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకత్వంపై పలు విమర్శలు చేశారు.
రాష్ట్రంలో అభివృద్ధి జరిగి ప్రజలకు మేలు జరిగితే దానిని స్వాగతించాల్సిన బదులు కల్వకుంట్ల కుటుంబ సభ్యులు నిరాధార ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధిపొందేందుకు, ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ నది ప్రక్షాళన, రైతు బోనస్ వంటి ప్రజాప్రయోజన కార్యక్రమాలపై కూడా బీఆర్ఎస్ అనవసర వివాదాలు సృష్టిస్తోందని ఆరోపించారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఇప్పటికే 25 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ అమలు చేసినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు దానిని కూడా విమర్శించడం విచారకరమన్నారు.
కాళేశ్వరం ప్రాజెక్టుపై స్పందిస్తూ, మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణం, డిజైన్ మార్పులు అన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని, అదే సమయంలో బ్యారేజ్ దెబ్బతిందని ఆరోపించారు. ఎన్డీఎస్ఏ (చీణూూ) నివేదిక ప్రకారం మేడిగడ్డ ప్రాంతం భారీ బ్యారేజ్ నిర్మాణానికి అనుకూలం కాదని స్పష్టమైందన్నారు. ప్రస్తుతం అక్కడ బలవంతంగా నీటిని నిల్వ చేస్తే 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.
వేలాది మంది ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి రాజకీయాలు చేయడం కాంగ్రెస్ విధానం కాదని స్పష్టం చేసిన ఆయన, నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ (పోచంపాడు) వంటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిపుణుల సలహాలతో నిర్మించిందని గుర్తు చేశారు. మహారాష్ట్రతో 152 మీటర్ల ఒప్పందం చేసుకుని రాజ్‌భవన్‌లో సంబరాలు జరుపుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితం కాకుండా ప్రజల్లోకి వచ్చి రాష్ట్ర సమస్యలపై స్పందించాలని, నిరాధార ఆరోపణలు మానుకుని తెలంగాణ ప్రయోజనాల కోసం సహకరించాలని యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

### దాతృత్వానికి నిదర్శనం

**--దీక్షిత్ రెడ్డి సేవ అభినందనీయం**



మెట్రోన్యూస్,రేగోడు:- విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా మండల పరిధిలోని ఆర్ ఇటిక్యాల ఎంపియుపిఎస్ పాఠశాలకు మెదక్ జిల్లా సంగాయిపేట గ్రామానికి చెందిన స్థానిక ఉపాధ్యాయురాలు సంధ్య అల్లుడు దీక్షిత్ రెడ్డి రూ.5,000 విలువైన తెలుగు చూచిరాత, ఇంగ్లీష్ చూచిరాత మరియు టేబుల్స్ పుస్తకాలను పాఠశాల చిన్నారులకు గురువారం అందజేశారు. విద్యార్థుల్లో అందమైన చేతిరాత, భాషా నైపుణ్యాలు, గణితంపై పటిష్ఠమైన పునాది ఏర్పడాలనే ఉన్నత లక్ష్యంతో అందించిన ఈ విద్యాసామగ్రి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుందన్నారు. వారి సేవాభావం, విద్యపట్ల ఉన్న నిబద్ధత అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తోందని పేర్కొన్నారు . ఈ సందర్భంగా ఎంపియు పిఎస్ ప్రధానోపాధ్యాయులు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు సంధ్య, వెంకటేశం, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల తరఫున దీక్షిత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

### కల్లేపల్లి లో ఉచిత వైద్య శిబిరం



మెట్రో న్యూస్ బెజ్జంకి: కల్లేపల్లి లో బాల వికాస సన్ రైస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ బిగ్గుల్ల మోహన్ తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించుకున్న వారికి మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమణి ,వినయ్, ఉపసర్పంచ్ వినీత్ ,వార్డు సభ్యులు మోహన్ ,కనకయ్య, క్యాంపు మేనేజర్ రాజేందర్, అన్న మేరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**-ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో అన్ని సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు**
**-రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, దామోదర్ రాజనర్సింహ**
**-ఈఎస్ఐ ఏర్పాటుకు సహకరించిన మంత్రులు వివేక్ వెంకట స్వామి, దామోదర రాజనర్సింహలకు కృతజ్ఞతలు తెలిపిన జగ్గారెడ్డి**







మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించడంతో పాటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సత్వర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఈఎస్ఐ వైద్య సేవలను విస్తరిస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్‌తో కలిసి మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అన్ని మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను కల్పిస్తూ ఈఎస్ఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే కార్మికులు వైద్య చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అన్ని రకాల వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సంగారెడ్డిలో ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షల కుటుంబాలు ఈఎస్ఐ వైద్య సేవలపై ఆధారపడుతున్నాయని, ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఇటీవల ఆర్‌సీపురం ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా కొన్ని ప్రత్యేక వైద్య సేవలు లేకపోవడంతో రోగులు సనత్‌నగర్‌కు వెళ్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వచ్చే ఆరు నెలల్లో అక్కడ అన్ని ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి, కార్మికులు స్థానికంగానే పూర్తి స్థాయి చికిత్స పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. త్వరలో ఆర్‌సీపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో 20 పడకల డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వచ్చే ఏడాదిలో కార్డియాలజి సెంటర్‌ను కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక భారం మోసుకోవద్దని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ కార్మికులు ఈఎస్ఐ డిస్పెన్సరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. అనంతరం మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటికే ఏడు ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఉండగా, సంగారెడ్డిలో ఎనిమిదో డిస్పెన్సరీని ప్రారంభించడం సంతోషకరమన్నారు. రూ.200 కోట్లతో సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, ఆందోల్, జోగిపేట ప్రాంతాల ప్రజలకు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఈఎన్‌టీ, క్యాన్సర్ చికిత్స, ట్రామా కేర్, నేత్ర వైద్య సేవలు వంటి సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పీజీ సీట్లను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. ప్రజలకు అన్ని రకాల ఆధునిక వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లాలో కార్మికుల వైద్య సేవల విస్తరణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ... సంగారెడ్డి రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక జిల్లాగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వేలాది మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మరింత వైద్య మౌలిక వసతులను కల్పించాలని కోరారు. ఈఎస్ఐ వైద్య సేవల విస్తరణ కార్మికులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు వనిత సంతోష్, అంజమ్మ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ డా. గౌతమ్, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జూలై 9 (మెట్రో న్యూస్)జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం పరిశీలించారు.ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసి, నిరంతర పర్యవేక్షణ కొనసాగించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గోదాం పరిసర ప్రాంతాల భద్రత, రికార్డుల నిర్వహణ, సీలింగ్ ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు.

## ప్రజలు ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి



నిజామాబాద్, జులై 9( మెట్రోన్యూస్ )ప్రజలు ఆధ్యాత్మిక చిం తనతో ముందుకు సాగితే సమాజంలో శాంతి, సామ రస్యం నెలకొంటాయని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లోనే ఆలయాల అభివృద్ధి సాధ్యమవుతోందని,రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూప తి రెడ్డి అన్నారు. మాధవ నగర్ ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. ఆలయ పాలకవర్గ నూతన చైర్మన్ చలసాని మీనా- శ్రీనివాస్ లతో పాటు నూతన కార్యవర్గ సభ్యులకు రూరల్ ఎమ్మెల్యే నియామక పత్రాలు అంద జేశారు.

**కాంగ్రెస్ తోనే దేవాల యాల అభివృద్ధి**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవాలయాల అభివృద్ధికి కొత్త ఊపు వచ్చిందని, కాంగ్రెస్ పార్టీ తోనే దేవాలయాల అభివృద్ధి జరిగిందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం సహా అనేక ఆలయాల అభివృ ద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.దేవాలయాల ఆదాయం, ఆస్తులు భక్తు ల విశ్వాసానికి ప్రతీకలని, వాటి నిర్వహణలో ఎలాం టి అవకతవకలు జరిగిన సహించమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో ఆలయ పాలకవర్గ చైర్మన్ చలసాని మీనా- శ్రీనివాస్, డైరెక్టర్లు, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మ న్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తరుణ్, శ్రీనివా స్,వినోద్, ఉమ్మాజి నరేష్, మునిపల్లి సాయి రెడ్డి, రాంచందర్ గౌడ్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షు లు జనార్ధన్,గోవర్ధన్ రెడ్డి, సంజయ్, ప్రజాప్రతిని ధులు, స్థానిక బర్దిపూర్ సర్పంచ్ భాస్కర్, నాయ కులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం, పీసీసీ అధ్యక్షుని చిత్రపటాలకు పాలాభిషేకం



కామారెడ్డి జూలై 9 (మెట్రో న్యాస్)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా రైతులకు పంట పెట్టుబడి కోసం నేరుగా ఆర్థిక సహాయం నిధులను బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ సమక్షంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజాహిత నిర్ణయాలను కొనియాడారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతు భరోసా, పంట పెట్టుబడి సాయం నిధులను పారదర్శకంగా రైతుల ఖాతాల్లో జమ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు పక్షపాత వైఖరికి నిదర్శనమని అన్నారు. రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా రైతు సంక్షేమానికి ప్రభుత్వం సంపూర్ణ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని, రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిర్దేశిత

# గడువు లోపు పూర్తి చేయాలి

**-కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**-క్షేత్రస్థాయిలో అమలు తీరును**

**పరిశీలించిన జిల్లా పాలనాధికారి**




నిజామాబాద్, జూలై 9 ( మెట్రోన్యూస్ )పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తూ, నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఎస్ఐఆర్ లో భాగంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియలను కలెక్టర్ గురువారం పలు ప్రాంతాల్లో సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజామాబాద్ రూరల్ పరిధిలోని గాంధీనగర్ తండా, గూపన్ పల్లి గ్రామాలలో, నిజామాబాద్ నగరంలోని శంకర్ భవన్ పాఠశాలలో ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ వివరాల, నమోదు తీరును నిశితంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఎంత శాతం పూర్తయ్యింది, ఓటర్లు అందరికీ ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ పూర్తయిందా తదితర

వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో లేని ఓటర్లకు కూడా సమాచారం అందించాలని, గడువు లోపు వారు తమ ఎన్యూమరేషన్ ఫారంలు తిరిగి అందించేలా చూడాలన్నారు. జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారి ఎన్యూమరేషన్ ఫారంలను జాగ్రత్తగా పరిశీలించాలని, వివరాలు సరి చూసుకున్న మీదట వారి కుటుంబ సభ్యుడి సంతకంతో తీసుకోవచ్చని కలెక్టర్ బీఎల్ఓ లకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ ను ఏకకాలంలో సమాంతరంగా నిర్వహించాలని అన్నారు.

ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలో పొందుపర్చిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని బీఎల్ఓ సూపర్వైజర్లను ఆదేశించారు. ఓటర్లతో మర్యాదపూర్వకంగా మెలగాలని, ఓటరు మ్యాపింగ్ విషయంలో సహకారం అందించాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ దగ్గర ఓటరు జాబితా తప్పనిసరిగా ఉండాలని అన్నారు. చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డబుల్ ఓట్లు కలిగిన వారిని గుర్తిస్తూ, ఓటరు జాబితాలో మార్కింగ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా, సకాలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లు బీఎల్ఓ లకు తగిన సహకారం అందించాలని అన్నారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, తహసీల్దార్ వినయ్ సాగర్ తదితరులు ఉన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్

నిజామాబాద్, జూలై 9 ( మెట్రోన్యూస్ )జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఏ.ఓ బాలరాజు, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు

**-ఆంకాలజిస్ట్,సర్జికల్ వైద్యులు**

**చిన్నబాబు సుంకవల్లి**



నిజామాబాద్, జూలై 09( మెట్రోన్యూస్ )ఫ్లోరోసెన్స్ గైడెడ్, రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ ఆంకాలజిస్ట్,సర్జికల్ వైద్యులు చిన్నబాబు సుంకవల్లి తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్జికల్, ఆంకాలజీ వైద్యులు చిన్నబాబు సుంకవల్లి మాట్లాడుతూ.. గత దశాబ్దంలో క్యాన్సర్ చికిత్సలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ట్యూమర్ బయాలజీపై మెరుగైన అవగాహన పెరగడంతో, నేటి క్యాన్సర్ శస్త్రచికిత్సల లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించడం మాత్రమే కాకుండా, రోగికి మంచి జీవన నాణ్యతను అందిస్తూ పూర్తి నయం చేయడం. ఈ మార్పులో అత్యంత ముఖ్యమైన సాంకేతిక ఆవిష్కరణలలో ఒకటి రోబోటిక్ శస్త్రచికిత్స, ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ. ఈ ఆధునిక టెక్నాలజీలు అత్యంత ఖచ్చితత్వం, తక్కువ టిష్యూ డ్యామేజ్, తక్కువ రక్తనష్టం మరియు వేగవంతమైన కోలుకునే అవకాశాలను అందిస్తున్నాయన్నారు . హై-డెఫినిషన్ 3డి విజన్, ట్రెమర్-ఫ్రీ ఇన్‌స్ట్రుమెంట్స్, మనిషి చేతి కదలికలను అనుకరించే ప్రిస్టెడ్ ఇన్స్ట్రుమెంట్ ద్వారా క్లిష్టమైన శస్త్రచికిత్సలను అత్యంత నైపుణ్యంతో నిర్వహించవచ్చు అని తెలిపారు.సాధారణంగా చెప్పాలంటే, పెద్ద కోతలు లేకుండా కేవలం 8 ఎం ఎం చిన్న రంధ్రాల ద్వారా శస్త్రచికిత్స నిపుణుడు తన చేతులు శరీరం లోపల పనిచేస్తున్నట్లుగా ఆపరేషన్ చేయగలుగుతారన్నారు.దీని వలన రోగికి తక్కువ నొప్పి, చిన్న మచ్చలు, తక్కువ రక్తనష్టం కలుగుతుంది. ఇంకా స్మార్ట్ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) కలయికతో శస్త్రచికిత్సలు మరింత ఖచ్చితంగా, సురక్షితంగా మారుతున్నాయన్నారు.క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో ఫ్లోరోసెన్స్-గైడెడ్ రోబోటిక్ టెక్నాలజీ ఒక విప్లవాత్మక మార్పును తీసుకువచ్చాయని,ప్రత్యేకమైన ఫ్లోరోసెంట్ రంగులను ఉపయోగించి క్యాన్సర్ కణాలను మెరిసేలా చేయడం ద్వారా, రోబోటిక్ చేతులతో అత్యంత కచ్చితత్వంతో శస్త్రచికిత్సలు చేయడం సాధ్యమవుతుందన్నారు. తక్కువ నొప్పి,తక్కువ రక్తనష్టం,తక్కువ ఆసుపత్రి రోజులు,త్వరగా పనికి తిరిగి వెళ్లే అవకాశం,మెరుగైన జీవన నాణ్యత,తక్కువ మచ్చలు,కుటుంబ, భావోద్వేగ ఆర్థిక ఒత్తిడి తగ్గడం వంటివి రోగులకు కలిగే ప్రధాన ప్రయోజనాలు అని తెలిపారు. క్యాన్సర్‌ను నయం చేయడమే కాదు, రోగి జీవితాన్ని మరింత మెరుగ్గా మార్చడం కూడా ఆధునిక శస్త్రచికిత్సల లక్ష్యం అని తెలియజేశారు. ఈ సమావేశంలో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ పిఆర్వో మధు తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి.

**రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్**



కామారెడ్డి జూలై 9 (మెట్రో న్యూస్)భూముల రీ సర్వే ను పగడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వేడీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ సాంకేతికతతో పారదర్శక సర్వే60 రోజులకు మించి భూ భారతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దురీ సర్వే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి భూముల రీ సర్వే, నక్ష భూములపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెవెన్యూ శాఖ కార్యదర్శిభూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కామారెడ్డి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్. అడిషనల్ కలెక్టర్ విక్టర్. ఏడి ల్యాండ్ సర్వే శ్రీనివాస్. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు.

డీజీపీఎస్ రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు.రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.

సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో రీసర్వే పనులపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కీలక ఆదేశాలుడైలీ ప్రోగ్రెస్ అప్డేట్, లైసెన్స్ సర్వేయర్ల సమావేశం నిర్వహణసి సి ఎల్ ఏ హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లాలో జరుగుతున్న రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పలు కీలక సూచనలు చేశారు.డైలీ ప్రోగ్రెస్ రిపోర్టు రీసర్వే పనుల పురోగతిని ప్రతిరోజు స్ప్రెడ్ షీట్ రూపంలో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు.లైసెన్స్ సర్వేయర్ల సమావేశం ఈరోజు లైసెన్స్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. రీసర్వే పనుల్లో వారి పాత్ర, బాధ్యతలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని తెలిపారు.రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా, నాణ్యతతో పూర్తి చేయాలని, అందులో ఎలాంటి జాప్యానికి తావు ఇవ్వొద్దని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# వి.బి.జి.రామ్‌జీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని

# గ్రామాల్లో శాశ్వత ప్రభుత్వ ఆస్తులు నిర్మించాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

**గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను శాస్త్రీయంగా రూపొందించాలి**

**పాఠశాలలు, అంగన్‌వాడీలు, గ్రంథాలయాలు, గోదాములు, కోల్డ్ స్టోరేజీలతో సహా 318 రకాల పనులకు అవకాశం**

**కనీసం 50 శాతం నిధులను ఆస్తుల సృష్టికే వినియోగించాలి**

**రోడ్లు, డ్రైన్లకే పరిమితం కాకుండా గ్రామాల భవిష్యత్ తరతరాలకు ప్రయోజనం చేకూరే పనులు చేపట్టాలి**



జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూలై 09 (మెట్రో న్యూస్) : వి.బి.జి.రామ్‌జీ (ఎదీ+=ూవీ+) పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో 10 మండలాలు సారంగాపూర్, బీర్ పూర్, రాయికల్, జగిత్యాల రూరల్, జగిత్యాల అర్బన్, ధర్మపురి, బుగ్గారం, ఎండపెల్లి, వెల్గటూర్, గొల్లపెల్లి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్/ ఎం.పి.డి.ఓ. చిరంజీవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, వి.బి.జి.రామ్‌జీ పథకం, నరేగా పథకంలో వచ్చిన మార్పులను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, 2005లో గ్రామీణ ప్రాంతాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, గత 21 సంవత్సరాలుగా ఈ పథకం విజయవంతంగా అమలై గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం గణనీయంగా తగ్గిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు, విద్యా స్థాయి కూడా ఎంతో మెరుగుపడ్డాయని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని, చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, మంజూరైన నిధులతో పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.గ్రామనలోని వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి, పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని, ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో శాశ్వత ఆస్తుల సృష్టే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం వి.బి.జి.రామ్‌జీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో అవసరమైన ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ గోడల నిర్మాణాన్ని ఈ పథకం ద్వారా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా గ్రామీణ గ్రంథాలయాలు, అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, సోలార్ వీధి దీపాలు, బస్ స్టాండ్లు, గోదాములు, కోల్డ్ స్టోరేజీలు తదితర 318 రకాల అభివృద్ధి పనులను ఈ పథకం ద్వారా చేపట్టే అవకాశం ఉందన్నారు. కేవలం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికే పరిమితం కాకుండా గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రోడ్లు నిర్మించడం అవసరమే అయినప్పటికీ, గ్రామానికి తరతరాల పాటు ఉపయోగపడే ఆస్తులను సృష్టిస్తే ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి. రాజ గౌడ్, జెడ్పీ సి ఈ ఓ గౌతం రెడ్డి, డి ఆర్ డి ఓ రఘువరన్, డిపిఓ మధుసూదన్, మాస్టర్ ట్రైనర్/ ఎం.పి.డి.ఓ. చిరంజీవి, సంబంధిత జిల్లా అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఛాత్రోన్‌కి గూంజ్ కార్యక్రమం

**మెట్రో న్యూస్,ఎల్ బి నగర్ :** ఛాత్రోన్ కి గూంజ్ కార్యక్రమం భాగంగా విద్యార్థులతో ముఖాముఖి చర్చా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయభాను చిబ్ , రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ , రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థపై అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వేషధారణలో యువజన కాంగ్రెస్ నాయకులు వినూత్న నాటికను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వల్ల నష్టపోయిన పలువురు విద్యార్థులు వేదిక మీద తమ అనుభవాలను పంచుకుంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాల కష్టానికి సరైన ఫలితం దక్క కుండా పరీక్ష విధానంలో అవకతవకల కారణంగా తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయభాను చిబ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దేశ విద్యా వ్యవస్థలో నెలకొన్న లోపాలు, నీట్ పరీక్షల్లో జరిగిన



అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులను సవివరంగా వివరించారు. విద్యను వ్యాపారంగా కాకుండా ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించే వ్యవస్థగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ విద్యార్థులనుదేశించి మాట్లాడుతూ ..కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను కాపాడటంలో పూర్తిగా విఫలమైందని, నీట్ పేపర్ లీకేజీ ఘటనల్లో బాధ్యులపై ఇప్పటికీ కఠిన చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే కేంద్ర ప్రభుత్వాన్ని యువజన కాంగ్రెస్ ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో చోటు చేసుకున్న వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దేశవ్యాప్తంగా పారదర్శకమైన, విశ్వసనీయమైన పరీక్షా విధానాన్ని అమలు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రవణ్ రావు , రాష్ట్ర ఇంచార్జులు ఖాలీద్ , భవ్య , యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


## సర్ ఓటర్ హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**- బిఆర్ఎస్ నాయకుడు గోవింద్ శ్రీధర్**



**మాడ్గుల జులై 09( మెట్రో న్యూస్):** మాడ్గుల మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్ ఓటర్ హెల్ప్ డెస్క్ ను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సామాజిక సేవ కార్యకర్త, బిఆర్ఎస్ నాయకుడు గోవింద్ శ్రీధర్ అన్నారు. ఈ మేరకు గురువారం అవురపల్లి గ్రామంలో ఎన్యుమరేషన్ ఫారాలు నింపే కార్యక్రమాన్ని బిఆర్ఎస్ నాయకులు పట్టపు వెంకటేశ్వరరావు,గౌని లాలయ్య గౌడ్,గోవిందు శ్రీధర్ గ్రామ బిఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారం నింపాలని సూచించారు. ఫారంలో తాజా ఫోటో,ఆధార్ వివరాలు నమోదు చేస్తే డూప్లికేట్ ఓట్లు తొలగుతాయని తెలిపారు. 2002 ఓటర్ జాబితాలో పేరు లేని వారు తల్లిదండ్రుల వివరాలు తప్పనిసరిగా ఇవ్వాలని బిఎల్ ఏలకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల ఓటర్లు బిఆర్ఎస్ పార్టీ హెల్ప్ డెస్క్ సహాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అవురపల్లి సర్పంచ్ కిన్నెర పోచయ్య,ఉప సర్పంచ్ బన్నె చెన్నయ్య, వార్డు మెంబర్లు బోడిగాల యాదయ్య,గుడ్ల వెంకయ్య, బిఎల్ఓ లు కళావతి, అరుణ,కిన్నెర మహేందర్, బిఆర్ఎస్ పార్టీబిఎల్ఏలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పై మాజీ మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే కృష్ణారావు సమావేశం




**మెట్రో న్యూస్, కేపీహెచ్‌బీ కాలనీ :** ఎస్ఐఆర్ పై మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో గురువారం ఏర్పాటైన సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేమాధవరంకృష్ణారావు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ పై ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, అలాగే పార్టీ పరంగా చేయాల్సిన సూచనలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతోపాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, ఎస్ఐఆర్ కమిటీ నేతలు పాల్గొన్నారు.

## కౌకూర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్

**- విద్యార్థులతో కలిసి ఉదయం అల్పాహారం చేసిన జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (మెట్రో న్యూస్ ):** మేడ్చల్ జిల్లాలోని అల్వాల్ మండలం కౌకూర్ లో జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులతో కలిసి కలెక్టర్ అల్పాహారం చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ విద్యార్థులు ప్రతిరోజు తమ దినచర్యలో భాగంగా న్యూస్ పేపర్ చదవాలని, అదొక అలవాటుగా చేసుకోవాలని బోధించారు. విద్యార్థులు స్టేజ్ ఫియర్ లేకుండా మీకొచ్చిన భాషలోనే స్టేజ్ పై మాట్లాడాలని తద్వారా మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. పాఠశాలలో మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, సౌకర్యాలు సరిగా ఉన్నాయా అని హెడ్ మాస్టర్ మురళీ కృష్ణ మూర్తిని కలెక్టర్ అడుగగా, అదనపు తరగతి గదులు అవసరమని కలెక్టర్ కు తెలిపారు. అవసరమైన మౌళిక వస తులైన టాయిలెట్లు, తరగతి గదులు వంటి వాటి ప్రతిపాదనలు పంపా లని కలెక్టర్ సూచించారు. పాఠశాలలోని సైన్స్‌ల్యాబ్,లైబ్రరీతరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు కోరిన స్పోర్ట్స్ సమాగ్రిని అందిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రేణుకా దేవి, అల్వాల్ ఎంఆర్ఓ రాములు, హెడ్ మాస్టర్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



## వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డా. కె. ఆనంద్ బాధ్యతల స్వీకరణ



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (మెట్రో న్యూస్ ):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా డా. కె. ఆనంద్ గురువారం భాధ్యతలు స్వీకరించారు. విధులు నిర్వహిస్తున్న డా. సి. ఉమా గౌరిని పరిపాలనా కారణాల దృష్ట్యా తక్షణ ప్రభావంతో రిలీవ్ చేసి, ప్రజారోగ్య మరియు కుటుంబ సంక్షేమ సంచాలకులు, హైదరాబాద్ కార్యాల యంలో రిపోర్ట్ చేయవలసిందిగా ఆదేశించారు. ప్రస్తుతం నిలోఫర్ ఆసుపత్రి, హైదరాబాద్‌లో సివిల్ సర్జన్ ఆర్.ఎం.ఓ గా విధులు నిర్వహిస్తున్న డా. కె. ఆనంద్‌ని మెడ్చల్‌మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా (డీఎంహెచ్ఓ) ఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు డా. కె. ఆనంద్ నేడు మెడ్చల్‌మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ మను చౌదరి, అదనపు కలెక్టర్‌ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య, ఆరోగ్య సేవలను అందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేస్తానని డా. కె. ఆనంద్ తెలిపారు. జిల్లాలో అమలులో ఉన్న ప్రజారోగ్య కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య పథకాలు మరియు సంక్షేమ కార్యక్రమాల అమలును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. డా. కె. ఆనంద్ కి మెడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పరిపాలనా మరియు ప్రజారోగ్య అనుభవం ఉంది. ఆయన గతంలో మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిగా, మెడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్‌గా, అలాగే జిల్లా మాతా శిశు సంక్షేమ కార్యక్రమ & నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా అధికారిగా విజయవంతంగా విధులు నిర్వహించారు. జిల్లాలోని ఆరోగ్య వ్యవస్థ, ప్రజారోగ్య కార్యక్రమాలు మరియు మాతా–శిశు సంక్షేమ సేవల అమలుపై ఆయనకు విస్తృత అవగాహన మరియు అనుభవం ఉంది.

## అందుబాటు ధరల్లో వైద్య నిర్ధారణ సేవలు

**- రాంపల్లిలో పీపుల్స్ వెల్ఫేర్ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం**

**కీసర, జూలై 9 (మెట్రో న్యూస్):** సామాన్య ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య నిర్ధారణ సేవలు అందించాలనే లక్ష్యంతో రాంపల్లి ఎక్స్‌రోడ్‌లో పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీపుల్స్ వెల్ఫేర్ డయాగ్నస్టిక్ సెంటర్ను నాగారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందుబాటు ధరల్లో ఆధునిక వైద్య పరీక్షలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. వ్యాధులను ముందస్తుగా గుర్తించడంలో డయాగ్నస్టిక్ కేంద్రాలు కీలకపాత్రపోషిస్తాయని చెప్పారు. ఆధునిక సాంకేతికతతో కూడిన పరీక్షలు, ఆరోగ్య తనిఖీ ప్యాకేజీలు, ఇంటి వద్దే శాంపిల్స్ సేకరణ వంటి సేవలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని వివరించారు. ట్రస్ట్ సభ్యుడు జె. చంద్రశేఖర్ మాట్లాడుతూ సామాన్యులకు నాణ్యమైన వైద్య పరీక్షలను తక్కువ వ్యయంతో అందించాలనే సంకల్పంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ గాంధీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యం సాగర్‌తో పాటు కృష్ణరెడ్డి, సాయి, గోపి, జి. వెంకటేశ్వరరావు, బి.వి. సత్యనారాయణ, ఆనంద్, ఎం. శ్రీనివాస్, ఎం.ఎల్. చౌదరి, నాగరాజు, శేషగిరిరావు, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువ పడే అవకాశం

- **నీటి ఎద్దడిని తట్టుకునే, వర్షాధార పంటలను సాగు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలి**
- **జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

వికారాబాద్, మెట్రో న్యూస్ : గురువారం ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉన్నందున పంటల సాగుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు లు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, నీటి పారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.... నీటి ఆధారిత పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే విధంగా




అధికారులు రైతులకు తెలియజేయాలన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల అతి తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని, నీటి ఆధారిత పంటలు వేసినట్లయితే రైతులు నష్టపోతారు అనే విషయాన్ని వారికి స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రిజర్వాయర్లలో నీటి సామర్థ్యం తక్కువగా ఉన్నందున ఆయకట్టు కింద ఉన్న పొలాల్లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు అంటే కందులు, మొక్కలు, చిరు




ధాన్యాల పంటలనువేసుకునేవిధంగా రైతులనుప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈవీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుండి జిల్లా వ్యవసాయ అధికారి కవిత, ఇరిగేషన్ డిఈ మంజుల సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటీపీ వాలిడిటీని వారం రోజులకు పెంచండి: కె రాజిరెడ్డి



**పరిగి (మెట్రో న్యూస్ ):** యూరియా బుకింగ్ ఓటీపీ వాలిడిటీ నీ వారం రోజులకు పెంచాలని దోమ మండల సర్పంచుల సంగం మాజీ అధ్యక్షులు కె రాజిరెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖను కోరారు. రైతులు మీసేవ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవచ్చని ఓటీపీ వాలిడిటీ రెండు రోజులు మాత్రమే ఉంటుంది అని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేసిన నేపత్యంలో ఫర్టిలైజర్ డీలర్ దగ్గర యూరియా నిల్వలు అందుబాటులో లేకుంటే రైతు ఏం చేయాలి మళ్ళీ మీ సేవకు రైతు వెళ్లి మళ్ళీ బుక్ చేసుకోవాలి గట్ల మీద ఉండాల్సిన రైతు రోడ్ల మీద తిరగాల్సి వస్తుంది మీ సేవలో రైతుకు అప్లికేషన్ రుసుము లేకుండా ఎరువులు బుక్ చేసే విదంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి రబి లో యాప్ బుకింగ్ ద్వారా వారం వరకు కూడా యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాహకంతో గత రెండున్నర ఏళ్ళ నుండి రైతులకు ఎరువుల లభ్యతలో తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని అన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలి : రావు కార్తీక్ రావు



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** ఓటరు వెరిఫికేషన్ లో అర్హులైన వారిలో ఏ ఒక్కరి ఓటు కూడా రద్దు కాకుండా బీఎల్ఏ, బీఎల్ఓలు ప్రక్రియను పారదర్శకంగా కొనసాగించాలని నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు రావు కార్తీక్ రావు అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాలకృష్ణనగర్ లో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు ప్రభృతులతో కలసి ఓటర్లకు ఎమ్యునరేషన్ పత్రాలు పంపిణీ చేసిన అనంతరం కార్తీక్ రావు మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఏ, బీఎల్ఓలు భాగస్వాములై ఓటర్లకు సహకరించాలని కోరారు. అర్హత కలిగి ఉన్న ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా చూడాలని, ఎమ్యునరేషన్ పత్రాల పంపిణీలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎస్ఐర్ ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఓటర్లకు సహకరిస్తూ వారి ఓట్లు రద్దు కాకుండా శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదన్నారు. ఎస్ఐఆర్ పై ప్రజలు అనవసరమైన భయాలు, అనుమానాలు పెట్టుకోవద్దని, ఎలాంటి గందరగోళానికి గురికాకుండా నియోజకవర్గానికి చెందిన ప్రతిఒక్కరూ కొద్ది సమయాన్ని కేటాయించి సరైన సమాచారం ఇచ్చి ఓటు హక్కును కాపాడుకోవాలని కార్తీక్ రావు పిలుపునిచ్చారు.

## సాయి ప్రియ కాలనీలో చెట్టు నరికివేత

**- అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి**



**మేడిపల్లి, జూలై 09; (మెట్రో న్యూస్) :** ఒకవైపు పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి విస్తృతంగా మొక్కలు నాటుతుండగా, మరోవైపు కొందరు నిర్లక్షిణ్యంగా చెట్లను నరికి వేస్తున్నారు. అటవీ శాఖ అనుమతులు తీసుకోకుండా తమ ఇష్టారాజ్యంగా విలువైన చెట్లను తొలగించడం ఆందోళనకరమైన విషయం. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్–10, మేడిపల్లి డివిజన్ పరిధిలోని సాయి ప్రియ కాలనీ రోడ్ నెంబర్ 6 లో ఓ ప్లాట్ యజమాని అటవీ శాఖ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా భారీ వృక్షాన్ని జెసిబి సహాయంతో తొలగించారు. ఇటువంటి చర్యల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలగడమే కాకుండా జీవవైవిధ్యానికి కూడా ముప్పుగా మారుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే వర్షాలు లేక జనం అవస్థలు పడుతున్నట్లు వారు గుర్తు చేస్తున్నారు. ఈ చెట్టు నరికివేతపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## జన జాగరణ పోస్టర్ ఆవిష్కరణ


**వికారాబాద్, మెట్రో న్యూస్ :** సిపిఎస్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు సాధించడానికి రాష్ట్ర వ్యాప్తంగా జరగబోయే సీపీఎస్ ఉద్యోగుల జనజాగరణ యాత్ర"కు టీయూటీఎఫ్ వికారాబాద్ జిల్లా శాఖ సంపూర్ణ మద్దతు, ఇందులో భాగంగా ఈరోజు వికారా బాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జన జాగరణ పోస్టర్ను నాయకులు ఆవిష్కరించారు. సిపిఎస్ ఉద్యోగుల నయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ చిన్న జాగరణ యాత్ర జూలై 19న తాండూర్ కొడంగల్లో, జులై 20న పరిగి వికారాబాద్ లో జరుగుతుందని దీనిని విజయవంతం చేయాలని జిల్లా టియుటిఎఫ్ అధ్యక్షులు సుదర్శన్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివప్ప, వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ , జిల్లా బాధ్యులు శ్రీనివాస్ , వివిధ మండలాల అద్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటయ్య , విష్ణువర్ధన్ , భాస్కర్ , మహిపాల్ , గోపాల్ పాల్గొన్నారు.

## భారీ వర్ష సూచన..



ఏపీలో నేడు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వాతావరణం నెలకొంటుందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే ఛాన్స్ ఉంది. వాతావరణం అనుకూలించని సమయంలో బయటకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.








# గత పాలకుల పాపాలే.. ప్రజల పాలిట శాపాలు

బనగానపల్లె: గత పాలకులు చేసిన పాపాలు ప్రజల పాలిట శాపాలుగా మారాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో పర్యటించిన సీఎం.. రైతులకు పట్టాదారు పాస్పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసినట్టు తెలిపారు. ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం ఉండాలి. ప్రతి సమస్యకు పరిష్కారం చూపే బాధ్యత నాది. తిరుపతి జిల్లా శెట్టిపల్లిలో, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులో 70 ఏళ్ల నాటి సమస్యలు పరిష్కరించాం. భూముల వివరాలన్నీ మీ సమక్షంలోనే పొందుపరుస్తున్నాం. దళారీ వ్యవస్థకు చోటు లేకుండా గ్రామసభల్లోనే పుస్తకాలిస్తున్నాం. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా చేయాలన్నదే మా లక్ష్యం. 6,887 గ్రామాల్లో సర్వే చేశాం.. 29,04,000 పాస్ పుస్తకాలిచ్చాం. క్యూఆర్ కోడ్లో రికార్డులన్నీ స్పష్టంగా ఉంటాయి. డోన్లో ఎన్నో ఏళ్లుగా వక్ఫ్ భూములు సాగు చేసుకుంటున్న 784 మంది రైతుల సమస్య పరిష్కరించాం" అని సీఎం తెలిపారు.




దక్షిణ కొరియా, జులై 9: పెట్టుబడుల సాధన కోసం దక్షిణ కొరియాకు వెళ్లిన ఏపీ మంత్రి నారా లోకేశ్.. పలు కంపెనీల ప్రతినిధులతో వరుసగా భేటీ అవుతూ బిజీబిజీగా గడుపుతున్నారు. ఐదోరోజు పర్యటనలో భాగంగా సియోల్‌లో కియా మోటార్స్ ఉన్నతస్థాయి బృందంతో మంత్రి సమావేశమయ్యారు. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఈవీ, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రం విస్తరించాలని కోరారు. పీబీవీ వాహనాలతో సహా ఈవీ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. విశాఖ సమీపంలో సీకేడీ అసెంబ్లీ, ఎగుమతి కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవీ కాంపోనెంట్లు, బ్యాటరీ సిస్టమ్‌ల తయారీ కేంద్రం ప్రతిపాదనను కియా ముందు ఉంచారు. ఈవీ పవర్‌ట్రెయిన్ టెస్టింగ్, వెహికల్ హోమోలోగేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతపురం కియా ప్లాంట్ కార్యకలాపాలను మరింత విస్తరించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని కియా మోటార్స్ ప్రతినిధులు వెల్లడించారు.

కొరియా విదేశాంగ ఉపమంత్రితో లోకేశ్ భేటీ

సౌత్ కొరియా విదేశాంగ ఉపమంత్రి సిసిలియా చుంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. కొరియన్ పెట్టుబడిదారులకు నమ్మకమైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఈ సందర్భంగా లోకేశ్ తెలిపారు. ఏపీ 3ఎస్ విధానం పెట్టుబడిదారులకు రక్షణ కవచమని చెప్పుకొచ్చారు. స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్‌తో పరిశ్రమలకు పూర్తి భరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏపీ - కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కొరియాతో కలిసి సంయుక్త శిక్షణా అకాడమీలు ఏర్పాటు చేసేందుకు ఏపీ సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, టూరిజంలో కొరియన్ పెట్టుబడులకు ఆహ్వానం పలికారు. విశాఖ-బుసాన్/ఇంచియాన్ మధ్య ప్రత్యక్ష విమాన సౌకర్యం, ఏపీ యూనివర్సిటీల్లో కొరియన్ భాషా కేంద్రాల ఏర్పాటుకు మంత్రి విజ్ఞప్తి చేశారు. పోర్టుల సామర్థ్యంతో ఎగుమతులకు ఏపీ ఉత్తమ కేంద్రంగా చెప్పుకొచ్చారు. కొరియా- ఏపీ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.



## బస్సు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి

విజయవాడలో ఒక విషాదకరమైన రోడ్డు ప్రమాదం జరిగింది; జిల్లాలోని ఒక ట్రాఫిక్ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా, అదుపు తప్పిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు ఢీకొనడంతో ఒక యువకుడు మరణించాడు. ఈ ఘటన సీసీటీవీ కెమెరాలో నమోదైంది. నివేదికల ప్రకారం, బాధితుడు రోడ్డు దాటుతుండగా తన మొబైల్ ఫోన్ చూస్తుండగా ఒక బస్సు అతడిని ఢీకొట్టింది. అతను వాహనం కింద పడి అక్కడికక్కడే మరణించాడు. 46 సెకన్ల నిడివి గల ఈ సీసీటీవీ క్లిప్‌లో, సంఘటన జరిగిన సమయంలో సుమారు ఎనిమిది నుంచి పది మంది పాదచారులు రోడ్డు దాటుతున్నట్లు కనిపిస్తుంది. ఆకుపచ్చ టీ-షర్టు, నల్ల షార్ట్స్, స్లిప్-ఆన్స్ ధరించి, చేతిలో హ్యాండ్‌బ్యాగ్ లాంటిది పట్టుకుని ఉన్న బాధితుడు, ఇతరులతో పాటు రోడ్డు దాటడం ప్రారంభించాడు. కొన్ని అడుగులు వేసిన తర్వాత, అతను తన జేబులోంచి మొబైల్ ఫోన్ తీశాడని ఆరోపణలు ఉన్నాయి.

## తిరుపతిలో దారుణం



తిరుపతి రూరల్ మండలం ఓటేరు జాతీయ రహదారి సమీపంలో జరిగిన ఘటన కలకలం రేపింది. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మేస్త్రి శ్రీనివాసులు(35) ఈ ప్రాంతంలో దారుణ హత్యకు గురయ్యారు. రాత్రి సమయంలో మద్యం తాగడానికి వెళ్లిన అతడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ తిరుపతిలో మేస్త్రి శ్రీనివాసులు హత్య ఘటనతో స్థానికులు షాక్‌కు గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

## కళాకారుల ఆరోగ్యాన్ని కాపాడటం

### కూటమి ప్రభుత్వ బాధ్యత



అమరావతి, జులై 9: సంప్రదాయ కళలను పరిరక్షించడం అంటే వాటిని ప్రోత్సహించడం మాత్రమే కాదని, వాటిని జీవనాధారంగా చేసుకున్న కళాకారుల ఆరోగ్యం, సంక్షేమాన్ని కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో మాట్లాడిన సమయంలో వారు ఎదుర్కొంటున్న వృత్తి సంబంధిత ఆరోగ్య సమస్యలు తన దృష్టికి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో ఆత్మీయంగా మమేకమయ్యే అవకాశం లభించిందన్నారు. వారి అసాధారణ నైపుణ్యం, అపారమైన ఓర్పు, వృత్తిపట్ల ఉన్న అంకితభావం ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ఏళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న కళాకారులు వెన్ను, మెడ, కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, శ్వాస సంబంధిత ఇబ్బందులు వంటి అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తమ చేతుల మీద మోస్తున్న కళాకారుల ఆరోగ్యాన్ని కాపాడటం కూటమి ప్రభుత్వ బాధ్యత అని బలంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. కళాకారుల సమస్యలను తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి రాష్ట్రంలోని వివిధ హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సీతారాంపురం క్రోషే లేస్ కళాకారుల కోసం నిన్న(జులై 8న) వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించినట్లు పవన్ చెప్పారు. ఈరోజు(గురువారం)జులై 9న ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లి బొమ్మల కళాకారులు, కాకినాడ జిల్లాలోని ఉప్పాడ చేనేత కార్మికులు, కడప జిల్లాలోని మాధవరం చేనేత కార్మికులు, అనంతపురం జిల్లాలోని యాడికి చేనేత కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జులై 10న విజయనగరం జిల్లాలోని బొబ్బిలి వీణ కళాకారులు, అనకాపల్లి జిల్లాలోని ఎటికొప్పాక కళాకారులు, ఏలూరు జిల్లాలోని హ్యాండ్ నాటెడ్ వూలెన్ పైల్ కార్పెట్ కళాకారులు, మదనపల్లె చేనేత కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే, జులై 11న సత్యసాయి జిల్లాలోని ధర్మవరం చేనేత కార్మికులు, శ్రీకాకుళం జిల్లాలోని బుడితి ఇత్తడి కళాకారులు, కృష్ణా జిల్లాలోని పెడన బ్లాక్ కలంకారీ కళాకారులు, తిరుపతి జిల్లాలోని చెక్క శిల్ప కళాకారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## ఇక నుంచి మీ సంగతి చూస్తాం..

### కొడాలి నానికి బుద్దా వెంకన్న వార్నింగ్




విజయవాడ, జులై 9: వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నానిపై టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. (గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ భిక్ష పెడితే ఎమ్మెల్యే అయిన వ్యక్తి కొడాలి నాని అని అన్నారు. హనుమంతుడి ముందు కుప్పి గంతలు వేసిన విధంగా నాని, వంశీల తీరు ఉందంటూ కౌంటర్ ఇచ్చారు. ఓటమి తరవాత కొడాలి నాని కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్లారని.. ఇప్పుడు మళ్లీ నాగుపాములా బుసలు కొట్టాలని చూస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను నీచంగా తిట్టిన వ్యక్తి రావణ్ అని తెలిపారు.
హిందూ దేవుళ్లను రావణ్ కించపరిచారని.. అతడిపై ఉపా చట్టం పెడితే.. ఉప్మా, ఇడ్లీ అని అవమానిస్తారా అంటూ వెంకన్న ఫైర్ అయ్యారు. ఉపా చట్టాలను అవమానం చేసిన కొడాలిపై చర్యలు తీసుకోవాలన్నారు. 'జోసెఫ్ రావణ్ మీవాడే అని అందరికీ తెలుసు. జోసెఫ్‌కు మద్దతుగా జగన్ ప్రకటన చేశారు. క్రిమినల్స్, హంతకులకు మద్దతు ఇచ్చే పార్టీ వైసీపీ. ఇక నుంచి మీ సంగతి చూస్తాం. కొడాలి నాని నీకిదే లాస్ట్ వార్నింగ్.. పిచ్చి పిచ్చిగా వాగితే బుద్ధి చెప్పి తీరుతాం' అని హెచ్చరించారు.




కాకినాడ, జులై 9: రెండేళ్లుగా యూట్యూబ్ వేదికగా విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న యూట్యూబర్ జోసఫ్ రావణ్ ఆర్థిక వనరులపై పోలీసులు దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఐసీఐసీఐ, యస్ బ్యాంకులకు కాకినాడ పోలీసులు అధికారికంగా లేఖలు రాశారు. పోలీసుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని పరిశీలించిన బ్యాంక్ యాజమాన్యాలు, అతని పేరున ఉన్న ఖాతాలను తక్షణమే నిలిపివేస్తూ (ఫ్రీజ్) నిర్ణయం తీసుకున్నాయి. పోలీసుల ప్రాథమిక విచారణలో జోసఫ్ రావణ్ ఆర్థిక వనరులకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ꠸ప్రశ్న꠸ అనే వెబ్‌సైట్‌లో ఈ వివాదాస్పద వీడియోలను పోస్ట్ చేయడం ద్వారా అతను నెలకు రూ. 1.50 లక్షలకు పైగా ఆదాయం గడిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజల్లో ద్వేషాన్ని రేకెత్తించే కంటెంట్ ద్వారానే ఈ సంపాదన వస్తున్నట్లు తేలింది. కేసు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు.. ఈ నెల 2వ తేదీన రావణ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్‌ను తదుపరి విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపించారు. ప్రస్తుతం అతని ఫోన్‌లో నిక్షిప్తమై ఉన్న వివాదాస్పద వీడియోలు, డిలీట్ చేసిన డేటాతో పాటు వాట్సాప్ చాటింగ్‌లపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. అతని వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

### జూలై 17న టీటీడీ స్థానిక ఆలయాల్లో

## వైభవంగా ఆణివార ఆస్థానం



తిరుపతి, 2026 జూలై 09 టీటీడీ ఆధ్వర్యంలోని తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం, శ్రీ కోదండరామస్వామివారి ఆలయాల్లో జూలై 17న ఆణివార ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించనున్నారు. ఆణిమాసం చివరి రోజున నిర్వహించే ఈ విశిష్ట కొలువును ఆణివార ఆస్థానంగా పిలుస్తారు. మహంతుల కాలంలో దేవస్థాన పరిపాలన, ఆదాయ-వ్యయ లెక్కలు, నిల్వలు ప్రారంభమయ్యే పర్వదినంగా దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలోనిసాయంత్రం 5.30 నుండి 6.30 గంటల వరకు బంగారు వాకిలి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారికి ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీ పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి నూతన వస్త్రాలను విమాన ప్రదక్షిణగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పిస్తారు.
శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలోనిసాయంత్రం 4 నుండి 5 గంటల వరకు గరుడాళ్వార్ ఎదురుగా శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారి ఉత్సవమూర్తులకు ఆస్థానం నిర్వహిస్తారు.

## ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పిస్తాం



విజయవాడ, జులై 9: కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు. రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు.

వేరే లుక్, స్పేస్ వేరే
అవసరాలు...



# ఇదే కొత్త హైబ్రిడ్ హోమ్ ట్రెండ్!

భారతదేశంలో ఇంటీరియర్ డిజైన్ రంగంలో ఒక కొత్త విప్లవం చోటుచేసుకుంటోంది. విదేశీ డిజైన్లను యథాతథంగా అనుకరించే రోజులు పోయాయి. ఇప్పుడు భారతీయ జీవనశైలి, కుటుంబ అవసరాలు, వాతావరణానికి తగినట్టుగా గ్లోబల్ ట్రెండ్స్‌ను మార్చుకుంటూ cహైబ్రిడ్ హోమ్c అనే కొత్త కాన్సెప్ట్‌కు ఆదరణ పెరుగుతోంది. ఆధునిక డిజైన్లకు దేశీయతను జోడించి, అందంతో పాటు ఆచరణాత్మకతకు పెద్దపీట వేయడమే దీని ముఖ్య ఉద్దేశం.సాధారణంగా గ్లోబల్ మినిమలిజం అంటే తెల్లటి గోడలు, తక్కువ ఫర్నిచర్ ఉంటాయి. కానీ, భారతీయ ఇళ్లలో ఇది బోసిగా కనిపించడంతో పాటు, దుమ్ము స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే ఇక్కడ cవార్మ్ మినిమలిజంcకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అంటే, లేత గోధుమ, మట్టి రంగు వంటి సహజమైన రంగులు వాడుతున్నారు. గోడలకు టెక్స్‌చర్లు, ఫ్లూటెడ్ ప్యానెల్స్, కేన్/రాటన్ యాక్సెంట్లు, కోటా వంటి దేశీయ రాళ్లతో ఇంటికి ప్రత్యేక అందాన్ని తెస్తున్నారు.

యూరోపియన్ ఫర్నిచర్ చూడటానికి ఆకర్షణీయంగా ఉన్నా, భారతీయ కుటుంబాలకు అవసరమైన స్టోరేజీ సౌకర్యం వాటిలో తక్కువ. అందుకే, సౌకర్యవంతమైన సోఫాలు, కుర్చీలు వంటివి విదేశాల నుంచి తెప్పించుకుంటూనే... పండుగల సామాన్లు, ఇతర వస్తువులు దాచుకోవడానికి వీలుగా స్థానికంగా హైడ్రాలిక్ బెడ్లు, ఫ్లోర్-టు-సీలింగ్ క్యాబినెట్లను కస్టమైజ్ చేయించుకుంటున్నారు.

ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో ఇరుకు ఇళ్లలో వర్క్ ఫ్రమ్ హోమ్ కోసం ప్రత్యేక గది కేటాయించడం కష్టం. దీనికి పరిష్కారంగా, అవసరం లేనప్పుడు కనిపించకుండా కలిసిపోయే cఇన్విజిబుల్ ఆఫీస్cలు రూపొందిస్తున్నారు. గోడకు అమర్చే మడత డెస్కులు, ఆర్ట్ వెనుక దాగి ఉండే అకౌస్టిక్ ప్యానెల్స్, యాప్ ద్వారా మార్చుకోగల స్మార్ట్ లైటింగ్ వంటివి ఈ ట్రెండ్‌లో భాగమే.

సుస్థిరత విషయంలోనూ భారతీయ దృక్పథం భిన్నంగా ఉంది. త్వరగా పాడైపోయే మెటీరియల్స్ కన్నా, 15-20 ఏళ్లు మన్నేవే అసలైన సస్టైనబిలిటీ అని భావిస్తున్నారు. అందుకే, దృఢమైన ఇంజినీర్డ్ వుడ్, దేశీయ సహజ రాళ్లు, వాతావరణాన్ని తట్టుకునే ఫినిషింగ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

# జుట్టు ఊడుతోందా?.. ఈ ఆహారాలు తప్పక తినండి!

జుట్టు రాలిపోతుందని చాలామంది వెంటనే సప్లిమెంట్లు, విటమిన్ మాత్రల వైపు మొగ్గు చూపుతుంటారు. కానీ అసలు సమస్య శరీరంలో పోషకాల లోపం కావొచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. సరైన ఆహారం తీసుకుంటేనే జుట్టు బలంగా, ఆరోగ్యంగా పెరుగుతుందని సూచిస్తున్నారు. జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రొటీన్, ఐరన్, జింక్, విటమిన్-సి, ఒమెగా-3, విటమిన్-బి12 వంటి పోషకాలు తప్పనిసరిగా అవసరమని నిపుణులు తెలిపారు. ఏ ఒక్క ఆహారంతోనో జుట్టు రాలడం పూర్తిగా ఆగదని, కానీ పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు.



జుట్టు కోసం బయోటిన్ సప్లిమెంట్లకు బదులుగా రోజూ ఒక టేబుల్ స్పూన్ పొద్దుతిరుగుడు గింజలు తినాలని సూచించారు. వీటిలో ఉండే విటమిన్-ఈ, జింక్, సెలీనియం జుట్టు పెరుగుదలకు తోడ్పడతాయని వివరించారు.

ఐరన్ మాత్రలకు బదులుగా మునగాకు పొడి తీసుకోవాలని చెప్పారు. ఇందులో విటమిన్-ఏ, సీ, ఈతో పాటు ఐరన్, జింక్, అమైనో ఆమ్లాలు పుష్కలంగా ఉండి జుట్టు కుదుళ్లను బలపరుస్తాయని తెలిపారు. ప్రొటీన్ పౌడర్లకు బదులుగా 100 గ్రాముల పనీర్‌ను ఆహారంలో చేర్చాలని సూచించారు. ఇందులోని ప్రొటీన్, విటమిన్-ఈ, సెలీనియం జుట్టు కుదుళ్లకు పోషణ అందిస్తాయని చెప్పారు.

విటమిన్-సి మాత్రలకు బదులుగా ఉసిరికాయ తినడం మంచిదన్నారు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, ఐరన్ జుట్టు వేర్లను బలోపేతం చేసి, చుండ్రు, తెల్లజుట్టు సమస్యలను తగ్గించడంలో సాయపడతాయని వివరించారు.

ఒమెగా-3 సప్లిమెంట్లకు బదులుగా రోజూ ఒక టేబుల్ స్పూన్ అవిసె గింజలు తీసుకోవాలని చెప్పారు. అలాగే విటమిన్-బి12 కోసం పెరుగు తినాలని సూచించారు. పెరుగులోని లాక్టిక్ యాసిడ్ తలపై చర్మాన్ని శుభ్రంగా ఉంచి చుండ్రును తగ్గించడంలో ఉపయోగపడుతుందని తెలిపారు.

# వంట చేయడం కష్టంగా కాకుండా ఇష్టంగా

మన ఇళ్లలో ప్రతిరోజూ ఉదయం లేవగానే వంటగదిలో మొదలయ్యే హడావుడి అంతా ఇంతా కాదు. ఆఫీసులకు వెళ్లేవారు, పిల్లలను స్కూళ్లకు పంపేవారు సమయంతో పరుగు పందెం గుర్రాల్లా మారిపోతుంటారు. ఈ సమయంలో వంట చేయడం అంటేనే పెద్ద టాస్క్. అయితే ఇంత పెద్ద టాస్క్‌ను భారంగా కాకుండా కాస్త ఇష్టంగా, సులభంగా చేస్తే ఎంతో బాగుంటుంది కదా! అందుకే మన అమ్మమ్మలు, అమ్మలు పాటించే కొన్ని సంప్రదాయ పద్ధతులతో పాటు నేటి ఆధునిక టిప్స్ కూడా కలగలిపి ప్రయోగిస్తే కిచెన్ సగానికి పైగా శ్రమ తగ్గుతుందని IJIRT అధ్యయనం పేర్కొంది. అదెలాగో ఇప్పుడు చూద్దాం..

**ముందస్తు ప్లానింగ్, ప్రిపరేషన్**


వారంలో ఏం కూరలు చేయాలో, ఏం వంటలు చేయాలో ముందస్తు ఆలోచన చేయడం మంచిది. అలాగే వారానికి సరిపడా కూరగాయలను ముందే కడిగి, ఆరబెట్టి, కట్ చేసి ఎయిర్ టైట్ కంటైనర్లలో భద్రపరుచుకోండి. అలాగే వంటల్లో ఉపయోగించే మసాలా దినుసులు, పొడులు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వంటివి సిద్ధం చేసుకోండి. దీంతో సమయం చాలా ఆదా అవుతుంది.

**స్మార్ట్ గాడ్జెట్స్, టూల్స్ ఉపయోగించడం**

కాలానుగుణంగా మారుతున్న సాంకేతికతను వంటగదిలోనూ ఉపయోగించడం వల్ల శ్రమ చాలా తగ్గుతుంది. ముఖ్యంగా మల్టీ పర్పస్ టూల్స్ ఉపయోగించడం అంటే ఒకే పరికరంతో రకరకాల పనులు చేసే ఛాపర్లు, బ్లెండర్లు వాడండి. కూరగాయలను ఛాపర్‌తో కట్‌చేస్తే నిమిషాల్లో పని అయిపోతుంది. లేటెస్ట్ గాడ్జెట్స్ ఎయిర్ ఫ్రైయర్, రైస్ కుక్కర్ లేదా ఇన్‌స్టంట్ పాట్ వంటివి వంటను ఆటోమేటిగ్గా త్వరగా అయిపోయేలా చేస్తాయి.

**కిచెన్ అమరిక**

వంట చేసేటప్పుడు కావల్సిన వస్తువులు సకాలంలో దొరకకపోతే సమయం వృథా అవ్వడమే కాకుండా చిరాకు కూడా వస్తుంది. కాబట్టి మనం తరచుగా వాడే ఉప్పు, కారం, నూనె, పోపుల పెట్టె వంటి వాటిని గ్యాస్ స్టవ్‌కు దగ్గరగా, సులభంగా అందేలా ఉంచుకోండి. ఇక ముఖ్యంగా పప్పులు, మసాలా దినుసులు ఉండే డబ్బాలపై పేర్లు రాయం లేదా పారదర్శకంగా ఉండే గాజు, ప్లాస్టిక్ జార్లను వాడటం వల్ల వెతకాల్సిన పని తప్పుతుంది.



**వంట చేస్తూనే క్లీనింగ్ కూడా..**

చాలా మంది వంట పూర్తయిన తర్వాత గిన్నెల కొండను చూసి నీరసించిపోతుంటారు. అలా కాకుండా వంట చేసేటప్పుడే కూరగాయలు కోసిన చాకు, బోర్డు, మికసీ జార్లు, చిన్న చిన్న గిన్నెలు, గరిటెలు, స్పూన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం మంచిది. ఇక కూరగాయల పొట్టు, ఇతర వ్యర్థాలను నేరుగా పడేయడానికి చిన్న వేస్ట్ బాస్కెట్‌ను దగ్గరలో ఉంచుకోండి. దీనివల్ల కిచెన్ టాప్ ఎప్పుడూ శుభ్రంగా ఉంటుంది.



# బెల్లాన్ని ఏ విధంగా తీసుకోవాలి..

బెల్లాన్ని కొన్ని పదార్థాలతో కలిపి తీసుకుంటే దాని సుగుణాలు రెట్టింపవుతాయంటున్నారు పోషకాహార నిపుణులు. తద్వారా ఆయా ఆరోగ్య సమస్యల్ని తగ్గించడంలో బెల్లం మరింత ప్రభావవంతంగా పని చేస్తుందంటున్నారు.

**బెల్లం+నెయ్యి**

ఈ రెండూ కలిపి తీసుకుంటే మలబద్ధకం నుంచి విముక్తి పొందచ్చుట.

**బెల్లం+ధనియాలు**

నెలసరి సమయంలో అధిక రక్తస్రావం నుంచి విముక్తి పొందచ్చు. నెలసరి నొప్పుల్నీ తగ్గించుకోవచ్చు. స్పాటింగ్ మాత్రమే అవుతోందని బాధపడే వారికి ఆ సమస్య తగ్గి ఎప్పటిలాగే పిరియడ్స్ ప్రారంభమవుతాయట.

బెల్లం+సోంపు: నోటి దుర్వాసనను దూరం చేసుకోవచ్చు.. దంతాలపై పాచి పేరుకుపోకుండా జాగ్రత్తపడచ్చు.బెల్లం+గోంద్:ఎముకల్ని దృఢంగా చేయడానికి ఈ కాంబినేషన్ చక్కగా ఉపకరిస్తుంది. అలాగే పాలిచ్చే తల్లులు తీసుకుంటే చనుబాలు పుష్కలంగా ఉత్పత్తవుతాయ!

బెల్లం+ఆలివ్ గింజలు: తీసుకునే ఆహారంలోని ఫోలికామ్లం, ఐరన్ను శరీరం త్వరగా గ్రహించేందుకు ఈ కాంబినేషన్ తోడ్పడుతుంది. ఇక చర్మంపై ఏర్పడిన పిగ్మెంటేషన్ని తగ్గించడంతో పాటు జుట్టు పెరుగుదలకూ దోహదం చేస్తుందట.

బెల్లం+నువ్వులు: దగ్గు, జలుబు, ఫ్లూ.. వంటివి దరిచేరకుండా కాపాడుతుందట.

**బెల్లం+పల్లీలు**

శరీరంలో సత్తువను పెంచడానికి, ఆకలిని అదుపు చేయడానికి, ఆహారపు కోరికల్ని తగ్గించడానికి ఈ కాంబినేషన్ అద్భుతంగా పని చేస్తుందంటున్నారు నిపుణులు.

మెట్రో ఈవినింగ్స్






# కిస్మిస్‌లను ఇలా తిన్నారంటే.. మీరు ఊహించని ఎన్నో అద్భుతమైన లాభాలు..

డ్రై ఫ్రూట్స్ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయనే విషయం అందరికీ తెలిసిందే. వాటిలో ముఖ్యమైనవి కిస్‌మిస్. అయితే చాలామంది కిస్‌మిస్‌ను నేరుగా తింటుంటారు. కానీ, ఆయుర్వేదం, ఆరోగ్య నిపుణుల ప్రకారం.. కిస్‌మిస్‌ను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయాన్నే పరగడుపున ఆ నీటితో సహా తీసుకోవడం వల్ల శరీరానికి అద్భుతమైన ప్రయోజనాలు చేకూరుతాయి. నానబెట్టడం వల్ల వాటిపై ఉండే వేడి గుణం తగ్గి, పోషకాలను శరీరం త్వరగా గ్రహిస్తుంది.రక్తహీనత కు చెక్: నేటి కాలంలో చాలామంది, ముఖ్యంగా మహిళలు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. నానబెట్టిన కిస్‌మిస్‌లో ఐరన్, విటమిన్ బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంచి, రక్తాన్ని వృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి.రక్తహీనత కు చెక్: నేటి కాలంలో చాలామంది, ముఖ్యంగా మహిళలు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. నానబెట్టిన కిస్‌మిస్‌లో ఐరన్, విటమిన్ బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంచి, రక్తాన్ని వృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి.జీర్ణక్రియ మెరుగుపడుతుంది: కిస్‌మిస్‌లో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. రాత్రంతా ఇవి నీటిలో నానడం వల్ల ఫైబర్ మరింత ప్రభావవంతంగా మారుతుంది. ఉదయాన్నే వీటిని తినడం వల్ల జీర్ణవ్యవస్థ చురుగ్గా మారి, దీర్ఘకాలిక మలబద్ధకం, గ్యాస్ సమస్యల నుండి శాశ్వత ఉపశమనం లభిస్తుంది.జీర్ణక్రియ మెరుగుపడుతుంది: కిస్‌మిస్‌లో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. రాత్రంతా ఇవి నీటిలో నానడం వల్ల ఫైబర్ మరింత ప్రభావవంతంగా మారుతుంది.

# వర్షాకాలంలో ఏ రకాల కూరగాయలను తినకూడదో తెలుసా..?

ఈ వర్షాకాలం సీజన్‌లో ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలి. ఎందుకంటే ఈ సీజన్‌లో రకరకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఈ కాలంలో కొన్ని ఆహారాలకు దూరంగా ఉండటం మంచిది. లేదా వాటిని శుభ్రంగా కడిగి వండుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం..

వర్షాకాలం చల్లదనాన్ని, పచ్చదనాన్ని తీసుకువస్తుంది. కానీ ఇది ఆరోగ్యానికి చాలా సున్నితమైన సమయంగా కూడా. ఈ సమయంలో గాలిలో తేమ పెరిగి, బ్యాక్టీరియా, ఫంగస్, ఇతర సూక్ష్మజీవులు వేగంగా వృద్ధి చెందుతాయి. అందుకే ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం మంచిదంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా వర్షాకాలంలో కొన్ని రకాల కూరగాయలను తినకుండా ఉండటం లేదా మితంగా తీసుకోవడం ఉత్తమం.



ఆకు కూరలు: పాలకూర, మెంతి, ఆవాలు, బతువా, తోటకూర, క్యాబేజీ వంటి ఆకు కూరలలో వర్షాకాలంలో కీటకాలు, సూక్ష్మజీవులు సులభంగా చేరతాయి. వర్షపు నీరు, మట్టితో సంబంధం వల్ల బ్యాక్టీరియా అధికంగా పేరుకుపోతుంది. వీటిని సరిగ్గా శుభ్రం చేయకపోతే కడుపు ఇన్ఫెక్షన్లు, విరేచనాలు, ఫుడ్ పాయిజనింగ్ వంటి ప్రమాదాలకు దారితీయవచ్చు.

కాలీఫ్లవర్, క్యాబేజీ : వీటికి అనేక పొరలు ఉంటాయి. వాటి మధ్య తేమ,చిన్న కీటకాలు దాక్కునే అవకాశాలు ఉంటాయి. వర్షాకాలంలో ఈ కూరగాయలు పాడయ్యే ప్రమాదం కూడా పెరుగుతుంది. వాటిని సరిగ్గా శుభ్రం చేయకపోతే ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరగవచ్చంటున్నారు నిపుణులు.

పుట్టగొడుగులు: తేమతో కూడిన వాతావరణంలో పుట్టగొడుగులు త్వరగా పాడైపోతాయి. వర్షాకాలంలో మార్కెట్లో లభించే పుట్టగొడుగుల నాణ్యత దెబ్బతినవచ్చు. పాత లేదా పాడైపోయిన పుట్టగొడుగులను తినడం వల్ల కడుపు నొప్పి, వాంతులు, జీర్ణ సమస్యలు కలుగవచ్చు. అందువల్ల, నమ్మకమైన మూలం నుండి కొనుగోలు చేసిన తాజా పుట్టగొడుగులను మాత్రమే తినండి.

వంకాయ: వర్షాకాలంలో వంకాయలకు పురుగులు పట్టే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కొన్నిసార్లు, వంకాయ బయటకు బాగానే కనిపించినా, లోపల పురుగులు ఉండవచ్చు. అందువల్ల వంకాయను కొనుగోలు చేసేటప్పుడు, వండేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.



# 'టాక్సిక్' నుండి హాట్ సాంగ్ విడుదల

కన్నడ రాకింగ్ స్టార్ యశ్, బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్'. ఈ సినిమాలో ఇప్పటికే బోల్డ్ సీన్లు (శృంగార సన్నివేశాలు) మోతాదుకు మించి ఉన్నాయనే చర్చ నడుస్తుండగా, తాజాగా విడుదలైన 'తబాహీ' సాంగ్ ఈ వివాదాన్ని మరింత రాజేసింది. ఈ పాటలో యశ్, కియారాల మధ్య రొమాన్స్ డోస్ మితిమీరిపోయిందని, అది కాస్తా వల్గారిటీగా (అశ్లీలంగా) మారిందంటూ నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.

# 'కరక్కం' మూవీ రివ్యూ!




మలయాళ సినీ పరిశ్రమ నుంచి హారర్ కామెడీ జోనర్‌లో ఏదైనా సినిమా వస్తోందంటే ఓటీటీ ప్రేక్షకులలో సహజంగానే మంచి అంచనాలు ఉంటాయి. వైవిధ్యమైన కథలను, సహజత్వానికి దగ్గరగా ఉంటూనే ఆసక్తికరంగా తెరకెక్కించడంలో మాలీవుడ్ దర్శకులు దిట్ట. ఆ నమ్మకంతోనే థియేటర్లలో విడుదలైన చిత్రాలు ఓటీటీలోకి రాగానే ప్రేక్షకులు ఎగబడుతుంటారు. అలా సుభాష్ లలిత దర్శకత్వంలో శ్రీనాథ్ భాసి ప్రధాన పాత్రలో తెరకెక్కిన మలయాళ చిత్రం 'కరక్కం'.

# రెండో పెళ్లి చేసుకున్న 'కలర్స్' స్వాతి





తెలుగు ప్రేక్షకులకు 'కలర్స్' షో ద్వారా పరిచయమై, తనదైన నటనతో హీరోయిన్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి స్వాతి రెడ్డి (కలర్స్ స్వాతి) రెండో వివాహం చేసుకున్నారు. తన కెరీర్‌లో వైవిధ్యమైన చిత్రంగా నిలిచిన 'మంత్ ఆఫ్ మధు' సినిమా దర్శకుడు శ్రీకాంత్ నగోతితో ఆమె ఏడడుగులు వేశారు. గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య ఉన్న పరిచయం, స్నేహం కాస్తా ప్రేమగా మారి పెద్దల అంగీకారంతో పెళ్లి పీటల వరకు చేరింది. ఈ విషయాన్ని స్వాతి స్వయంగా తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకుంటూ పెళ్లి ఫోటోలను షేర్ చేయడంతో నెటిజన్లు, సినీ ప్రముఖులు ఈ కొత్త జంటకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# మెగా ఛాన్స్ మిస్ చేసుకున్న 'బ్లాస్ట్' బ్యూటీ



'కన్నప్ప', 'బ్లాస్ట్' వంటి చిత్రాలతో టాలీవుడ్‌లో తనదైన గుర్తింపు తెచ్చుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ ప్రీతీ ముకుందన్ ఒక భారీ క్రేజీ ప్రాజెక్ట్‌ను చేజార్చుకుంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'రాకా'లో నటించే గోల్డెన్ ఛాన్స్‌ను ఆమె మిస్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర కోసం ప్రీతీ ముకుందన్‌ను సంప్రదించినట్లు దర్శకుడు అట్లీ స్వయంగా ఒక తాజా ఇంటర్వ్యూలో వెల్లడించారు. అయితే, అప్పటికే ఆమె ఒప్పుకున్న ఇతర సినిమాల బిజీ షెడ్యూల్స్ మరియు డేట్స్ అడ్జస్ట్ కాకపోవడం వల్లే ఈ మెగా ఆఫర్‌ను వదులుకోవాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు.







కొచ్చిన్ సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారం నుంచి అసలైన రసవత్తర దశకు చేరుకోనుంది. రీజినల్ స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగే ఈ మెయిన్ డ్రాలో తలపడేందుకు భారత అగ్రశ్రేణి క్రీడాకారులు సిద్ధమయ్యారు. అయితే, ఈసారి టోర్నీలో సరికొత్తగా స్కోరింగ్ ఫార్మాట్‌ను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. దీనివల్ల మ్యాచ్‌లు చాలా వేగంగా, ఉత్కంఠభరితంగా సాగనున్నాయి. ఆటగాళ్లు ఈ తక్కువ సమయం ఉండే సెట్లకు త్వరగా అలవాటు పడటం ఇప్పుడు కీలకంగా మారింది. కొత్త నిబంధనల నేపథ్యంలో ప్రతి మ్యాచ్ అభిమానులకు మంచి కిక్ ఇవ్వనుంది.

ఈ వారాంతం జరిగే మ్యాచ్‌ల్లో అందరి దృష్టి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ క్రీడాకారులపైనే ఉంది. ముఖ్యంగా సతీష్ కుమార్ కరుణాకరన్, కృష్ణ ప్రసాద్ గరగ వంటి స్టార్ ప్లేయర్లు టైటిల్ రేసులో ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. కేరళ కోర్టుల్లో తమ అద్భుతమైన సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు వీరు రెడీ అయ్యారు. ఒత్తిడిని అధిగమించి వీరు ఎంతవరకు రాణిస్తారనే దానిపైనే విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. రాబోయే అంతర్జాతీయ టోర్నీల ఎంపికకు అవసరమైన కీలక ర్యాంకింగ్ పాయింట్లను సొంతం చేసుకోవడమే వీరి లక్ష్యం.

కొచ్చిన్ సీనియర్ ర్యాంకింగ్ బరిలో తెలుగు తేజాలు

సంప్రదాయ మ్యాచ్‌లతో పోలిస్తే ఈ 3ఇ15 స్కోరింగ్ విధానం ఆట తీరునే మార్చేయనుంది. సెట్లు తక్కువ పాయింట్లతో ముగిసిపోతాయి కాబట్టి, చిన్న పొరపాటు చేసినా కోలుకోవడం కష్టం. అందుకే ఆటగాళ్లు మొదటి నుంచే వ్యూహాత్మక వేగంతో, దూకుడుగా ఆడాల్సి ఉంటుంది. ఇప్పటికే జరిగిన క్వాలిఫైయర్ రౌండ్లలో తక్కువ ర్యాంక్ ఉన్న ప్లేయర్లు కూడా టాప్ సీడ్లకు షాక్ ఇచ్చారు. దీంతో కొచ్చిలో జరిగే ప్రతి ఓపెనింగ్ మ్యాచ్ ఇప్పుడు లోకల్ ఆడియన్స్‌కు అసలైన థ్రిల్‌ను పంచనుంది.

పురుషుల సింగిల్స్ సతీష్ కుమార్ కరుణాకరన్

పురుషుల డబుల్స్ కృష్ణ ప్రసాద్ గరగ టోర్నమెంట్ ఫార్మాట్ దూకుడుగా సాగే స్కోరింగ్ ఈ టోర్నీ మ్యాచ్‌లు జూలై 11 నుంచి 14 వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సెషన్లలో జరుగుతాయి. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా లైవ్ స్ట్రీమ్ ద్వారా అభిమానులు ఈ మ్యాచ్‌లను వీక్షించవచ్చు. అలాగే టోర్నమెంట్ సాఫ్ట్‌వేర్ పోర్టల్‌లో లైవ్ స్కోర్‌లను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ప్రతిష్టాత్మక టైటిల్ కోసం స్టార్ ప్లేయర్లు హోరాహోరీగా తలపడుతుండటంతో ప్రతి పాయింట్ ఇప్పుడు ఎంతో విలువైనదిగా మారింది.

కొచ్చిన్ సీనియర్ ర్యాంకింగ్ మ్యాచ్‌ల లైవ్ కవరేజ్

కొచ్చిలోని సందడి ఈ జాతీయ స్థాయి టోర్నీకి పర్ఫెక్ట్ వేదికగా నిలిచింది. వర్ధమాన క్రీడాకారులు తమ సత్తా చాటడానికి ఇదొక గొప్ప ప్లాట్‌ఫామ్. దేశవ్యాప్తంగా ఉన్న యువ షట్లర్లు తమ కలలను నిజం చేసుకునేలా ఈ టోర్నీ స్ఫూర్తినిస్తుంది. ఇక్కడ సాధించే విజయం అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి ఒక ముఖ్యమైన మైలురాయిగా మారుతుంది. ఈ వారాంతం బ్యాడ్మింటన్ కోర్టుల్లో అద్భుతమైన నైపుణ్యం, క్రీడా స్ఫూర్తిని మనం చూడబోతున్నాం.

# చరిత్ర సృష్టించిన రోజే వైభవ్ సూర్యవంశీ చెత్త రికార్డ్..!



టీమిండియా తరఫున తన తొలి మ్యాచులో వైభవ్ సూర్యవంశీ మిశ్రమ ఫలితాలు అందుకున్నాడు. ఇందులో ఉత్సాహం, నిరాశ వంటి ఫలితాలను అతడు ఎదుర్కొన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరఫున ఆడిన అతి పిన్న వయస్కుడైన క్రికెటర్ గా 15 ఏళ్ల బ్యాటర్ నిలిచాడు. కానీ శనివారం మాంచెస్టర్ లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో ఓ చెత్త రికార్డును సైతం తన పేరిట లిఖించుకున్నాడు.

## మెట్రో స్పోర్ట్స్ పేట

# టీమిండియా అసలు సమస్య



అంతర్జాతీయ టీ20ల్లో వరల్డ్ ఛాంపియన్ టీమిండియా పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయానంతరం టీమిండియా బరిలోకి దిగిన ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం సాధించలేకపోయింది. పసికూన ఐర్లాండ్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 0-2తో క్లీన్ స్వీప్ అయిన భారత్.. ఇంగ్లండ్ పర్యటనలోనూ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. దాంతో 20 ఏళ్ల టీ20 క్రికెట్ చరిత్రలోనే తొలిసారి వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం సాధించలేకపోయింది.

అంతేకాకుండా ఇంగ్లండ్‌తో మంగళవారం జరిగిన మూడో టీ20లో 125 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. అంతర్జాతీయ టీ20ల్లో 100+ రన్స్‌తో టీమిండియా ఓడిపోవడం కూడా ఇదే తొలిసారి. అది కూడా నయా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోనే ఈ చెత్త రికార్డ్ నమోదవ్వడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పిచ్ కండిషన్స్ వల్లే.. ఇంగ్లండ్‌తో మూడో టీ20 పరాజయం అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గౌతమ్ గంభీర్.. జట్టు పేలవ ప్రదర్శనపై వివరణ ఇచ్చాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2028 కోసం జట్టును రిసెట్ చేస్తున్నామని, కొత్త సారథి, యువ ఆటగాళ్లతో నయా టీమ్‌ను రెడీ చేస్తున్నామని చెప్పాడు.

జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా వంటి సీనియర్ ఆటగాళ్లు కూడా లేరని, అంతేకాకుండా ఇంగ్లండ్ కండిషన్స్‌ను అలవర్చుకోవడంలో ఆటగాళ్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపాడు. ఇవే భారత్ వరుస ఓటములకు కారణమని భావిస్తున్నామని వివరణ ఇచ్చాడు.

స్వింగ్ కండిషన్స్‌లో ఆడలేరు.

కానీ టీమిండియా అసలు సమస్య సీమింగ్, స్వింగ్ కండిషన్స్‌లో బ్యాటింగ్ చేయలేకపోవడం అనే విషయాన్ని గంభీర్ అంగీకరించలేకపోయాడు. అయితే జట్టుకు ఇది కొత్త సమస్య కాదు. ఎన్నో ఏళ్ల నుంచి టీమిండియాను ఈ సమస్య వేధిస్తోంది. భారత్‌లో ఉండే ఫ్లాట్ వికెట్స్, చిన్న మైదానల్లో దూకుడుగా ఆడే మన ఆటగాళ్లు.. స్వింగ్, సీమ్ కండిషన్స్‌లో, స్లో వికెట్‌లపై రాణించలేకపోతున్నారు.

ఐర్లాండ్ పర్యటనలో టీమిండియా ఓడటానికి.. ఇంగ్లండ్‌లో వరుస పరాజయాలకు కూడా ఇదే అసలు సమస్య. మూడో టీ20 అనంతరం ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ కూడా ఇదే విషయాన్నివెల్లడించాడు. ఇంగ్లండ్ వికెట్స్.. ఐపీఎల్ పిచ్‌లు కావని చురకలంటించాడు.

ప్రపంచకప్‌లోనూ.. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా ఒకే ఒక్క మ్యాచ్ ఓడింది. అది కూడా స్లో వికెట్‌పైనే. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌లో మంచి పేస్ బలగం కలిగిన సౌతాఫ్రికా చేతిలో భారీ తేడాతో చిత్తయ్యింది. ఈ సమస్యను అధిగమించడంపై టీమిండియా ఫోకస్ పెట్టాలి. భారత్‌లో కూడా సీమింగ్, పేస్ కండిషన్స్‌లో ఆడటం అలవర్చుకోవాలి. దేశవాళీ క్రికెట్‌లోనే ఈ తరహా పిచ్‌లతో ఆటగాళ్లను సిద్దం చేయాలి. లేదంటే విదేశీ పర్యటనల్లో భారత్‌కు ఇలాంటి ఘోర పరాజయాలు తప్పవని మాజీ క్రికెటర్లు హెచ్చరిస్తున్నారు.

Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 8919130975, 99126 14007